J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 22 31.10.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఉత్తరక్రియలు



**తిక్కవరపు జనార్ధన్‌రెడ్డి గారు**

నిర్యాణం : 27.10.2025

మీరిచ్చిన స్ఫూర్తి.. మీరందించిన కీర్తి
మీరు మిగిల్చిన స్మృతులతో
ఎప్పటికీ మిమ్మల్ని తలుచుకుంటూ..

**బరువెక్కిన హృదయాలతో...**

**తిక్కవరపు మంజుల** - భార్య
**తిక్కవరపు వంశీరామ్** - కుమారుడు
ఎం.డి - వంశీరామ్ హోమ్స్
**తిక్కవరపు శ్రుతిరెడ్డి** - కోడలు
**తిక్కవరపు ఆర్యన్‌రామ్‌రెడ్డి** - మనుమడు

**బద్వేలు సుబ్బారెడ్డి** - బావమరిది
సి.ఎం.డి - వంశీరామ్ బిల్డర్స్
**బద్వేలు జ్యోతి, బద్వేలు సోహినీ**
**బోగొల్లు మోహన్‌రెడ్డి** - బావమరిది
**బోగొల్లు నిర్మల** - చెల్లెలు
**బోగొల్లు ఉదీప్, బోగొల్లు సందీప్** - మేనల్లుళ్ళు

**VAMSIRAM GROUP**

**ఉత్తరక్రియలు :** వారి 'పెద్దకర్మ' తేది. 06.11.2025 గురువారం 12.00 గంటలకి హైదరాబాదు, గ్రీన్‌ల్యాండ్స్, బేగంపేటలోని ITC గ్రాండ్ కాకతీయ హోటల్ నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## అల్లూరురోడ్డు వద్ద..
# ప్రమాదాల బ్రిడ్జిని పరిశీలించిన అధికారులు



దగదర్తి మండల పరిధిలోని అల్లూరు రోడ్డు వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న ప్రమాదకర ప్రాంతాన్ని జిల్లా రవాణాశాఖ అధికారులు మురళీకృష్ణ, రవాణాశాఖ ఉప కమిషనర్ చందర్, కావలి రూరల్ సీఐ పాపారావు, జాతీయ రహదారి-5 అధికారులు ఇటీవల పరిశీలించారు. కావలి వెళ్లే దారిలో తరచూ రోడ్డుప్రమాదాలకు కారణమవుతున్న ఆ స్థలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. చాలాకాలం క్రితం నుంచీ ఆ బ్రిడ్జి దెబ్బతిని ఉండడం, బ్రిడ్జి నిర్మాణపు పనులు మధ్యలోనే ఆగిపోవడాన్ని గమనించారు. దాని నిర్మాణం విషయంలో సమస్యలు తలెత్తడంతో కాంట్రాక్టర్ ఆ పనులను నిలిపేశారని, అప్పటి నుంచి నెల్లూరు వైపు వెళ్లే దారిని సింగిల్ వేగా మార్చి, వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారని తెలుసుకున్నారు. దీంతో, వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా ఫోకస్‌లైట్లు, రేడియం స్టిక్కర్లు, డివైడర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఆగిపోయిన పనులను త్వరలో ప్రారంభించాలని సంకల్పించారు. వారివెంట దగదర్తి, బోగోలు ఎస్ఐలు జంపాని కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# నేతన్నలను ఆదుకోవాలి

ఇటీవల జిల్లాలో కురుస్తున్న భారీవానలతో మగ్గం గుంటల్లో నీళ్ళు నిలవడంతో, జీవనోపాధి కోల్పోయిన చేనేతకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పముజుల హరి కోరారు. తొలుత ఆయన జిల్లాలోని సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాల్లో ఉన్న చేనేతకారులను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ వానల ధాటికి గుర్రె నష్టపోయిన చేనేత కార్మికుల స్థితిగతులను తెలుసుకుని వారికి వెంటనే చేయూతనివ్వాలని విజ్ఞప్తిచేశారు. ఆదరణ పథకాన్ని కొనసాగించాలని, రాజీవ్ విద్యామిషన్ పథకాన్ని కూడా నేతన్నలకు అమలుచేయాలని, చేనేతపై ఉన్న జీఎస్టీని పూర్తిస్థాయిలో రద్దు చేయాలని ఆయన కోరారు. అఖిలభారత వీవర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నవంబరు 22, 23 తేదీలలో.. విజయవాడలో
# జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు
### ప్రముఖ సాహితీవేత్త చిన్ని నారాయణరావు



సాహిత్యరంగంలో నేడున్న ఏకాకితనాన్ని పోగొట్టి ఉమ్మడిలో వున్న హాయిని, సౌందర్యాన్ని వెలికి తియ్యడమే లక్ష్యంగా విజయవాడలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అధ్యక్షులు, సుప్రసిద్ధ సాహితీవేత్త చిన్ని నారాయణరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మహా సంకల్పంతో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీలలో కృష్ణాతీరం-విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగనున్న 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాల' కరపత్రాన్ని ఇటీవల నెల్లూరు ఆదిత్యనగర్‌లోని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహిత్యంతో పాటు దాని అనుబంధ రంగాల మధ్య దూరాన్ని తగ్గిస్తూ కళా సాంస్కృతిక రంగాలను ఒకే గొడుగు కిందికి తేవడం శుభపరిణామమన్నారు. సాంకేతిక విప్లవం నేపథ్యంలో కలయికలు కకావికలమైపోయిన పొడిబారిన సమాజంలో కవులు, రచయితలు, కళాకారులు, కార్టూనిస్టులు కలిసి ఒకచోట చేరి రెండు రోజుల పండుగను చేసుకోవడం సాహితీ ప్రపంచంలో ఒక చారిత్రాత్మక పరిణామమన్నారు. సాహిత్య, సాంస్కృతిక సమాజానికి ఒక గొప్ప వేదికను అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశకి, మల్లెతీగ సాహిత్యసేవాసంస్థకు సాహితీ, సాంస్కృతిక సారధుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ, కార్యనిర్వాహక అధ్యక్షులు యేమినేని వెంకటరమణ, చొప్పా రాఘవేంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ఉత్సవాలకు నాలుగురాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు గోవిందరాజు సుభద్రాదేవి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, పి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

# శ్రీసిటీలో.. 'నిట్టన్ ఇండియా' అదనపు ఉత్పత్తి కేంద్రం



శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన నిట్టన్ వాల్వ్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ 'నిట్టన్ ఇండియా టెక్ (ఎన్ఐటి) పరిశ్రమ అదనపు ఉత్పత్తి కేంద్రం ఇటీవల ప్రారంభమైంది. ఈ కొత్త ప్లాంట్‌ని సుమారు 7 ఎకరాల్లో 7,350 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఈ కంపెనీలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య 270 నుంచి 370కి పెరిగి, స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కూడా పెంచింది. హ్యుందాయ్, హోండా, టయోటా, అశోక్ లేలాండ్, యమహా, హెచ్ఎంఎస్ఐ వంటి పలు ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలకు వాల్వ్‌లు సరఫరాచేస్తున్న నిట్టన్ ఇండియా, ఈ విస్తరణతో వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 12 మిలియన్‌ల నుండి 24 మిలియన్ ఇంజిన్ వాల్వ్‌లకు పెంచడం విశేషం. ఈ సందర్భంగా ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యంగ్ ఓ కో మాట్లాడుతూ, నిట్టన్ కంపెనీలో ఇదొక మైలురాయి అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ సుందర్ ముఖ్య అతిథిగా పాల్గొని నిట్టన్ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ విస్తరణ భారతదేశంలో తమ సంస్థ ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తుందని జపాన్ నిట్టన్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ లీ తై హ్వాన్ తెలిపారు. నిట్టన్ బృందాన్ని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి అభినందిస్తూ, 2014లో శ్రీసిటీలో ఏర్పాటైన నిట్టన్ కంపెనీ, నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తన ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఈ విస్తరణ ప్రపంచ స్థాయిలో కంపెనీ ప్రతిష్ఠని మరింత పెంచుతుందన్నారు. నిట్టన్ గ్రూప్ ప్రముఖులు టెరుఆకి ఆండో, యుమికో షిండో, చో సియంగ్ హ్వాన్, రో యూన్ హో తదితరులు పాల్గొన్నారు.

# సియోల్‌లో శ్రీసిటీ బృందం



విదేశీ పెట్టుబడులు, వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీ మార్కెట్టింగ్ బృందం ఇటీవల కొరియాలోని సియోల్‌లో పర్యటించింది. సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ నేతృత్వంలో సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం డిప్యూటీ మిషన్ చీఫ్ నిశికాంత్ సింగ్ మరియు జపాన్ ఉన్నతాధికారులను కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతి, 31 దేశాలకు చెందిన 240కు పైగా పరిశ్రమలను ఆకర్షించడంలో శ్రీసిటీ కీలక పాత్రను తెలియజేశారు. ఎల్జీ, సోలుమ్, హ్యుందాయ్ ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ (హెచ్‌డీసీ), ఎస్కే ప్యుకోర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలు శ్రీసిటీలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వారికి వివరించారు. శ్రీసిటీ వేగవంతమైన పురోగతిని ప్రశంసించిన నిశికాంత్ సింగ్, భవిష్యత్ కొరియా పెట్టుబడులకు తన మద్దతు తెలిపారు. ఈ పర్యటన శ్రీసిటీ, కొరియన్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలపరుస్తుందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

## ఎస్‌డబ్ల్యుఎఫ్ నేతగా..
# కట్టా సుబ్రహ్మణ్యం



ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కట్టా సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఇటవల తిరుపతిలో జరిగిన ఆ సంఘం 13వ రాష్ట్ర మహాసభలో ఆయన్ను తమ సంఘానికి రాష్ట్రనేతగా ఎన్నుకున్నారు. 1989లో ఆర్టీసీలో ఉద్యోగిగా చేరిన కట్టా, ఎస్‌డబ్ల్యుఎఫ్‌లో పలు హోదాల్లో కూడా పనిచేశారు.

# యూరియా వచ్చేసింది

నెల్లూరు జిల్లాకు యూరియా ఎరువు పుష్కలంగా వచ్చేసింది. ఇటీవలే 1580 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి తెలిపారు. ఇటీవల ఆమె కోవూరు సమీపంలోని పడుగుపాడు రైల్వేస్టేషన్‌కు యూరియా బస్తాలు రావడంతో, వాటిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

# కానిస్టేబుల్ సస్పెండ్

నెల్లూరులోని ఓ హోటల్‌లో ఇటీవల పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన వారిలో విడవలూరు పోలీసు కానిస్టేబుల్ పుల్లారెడ్డి కూడా ఉండడంతో, ఆయన్ని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు.

# ఉత్సాహంగా.. యువజనోత్సవాలు



నెల్లూరులోని యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. స్థానిక డీకేడబ్ల్యు కళాశాలలో జరిగిన ఈ వేడుకల్లో నిర్వహించిన పలు పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. జానపద నృత్యాల్లో కె.నిఖిత బృందం ప్రథమస్థానం సాధించగా, జి.సుప్రియ బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా జానపద సంగీతంలో వి.యస్.ఆయాన బృందం మొదటి స్థానం, టి.భవాని బృందం రెండవ స్థానం సాధించాయి. కథా రచనలో ఆర్.మహేష్ ప్రథమస్థానం, వి.మహిత ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. పెయింటింగ్‌లో కె.వైష్ణవి, వి.చందన మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో బి.అభిషేక్, షేక్ రజియా, కవితల రచనలో చదలవాడ జైస్వాల్, ఎం.కవిత తొలి రెండుస్థానాలను సాధించుకున్నారు. సైన్సు మేళాలో మొహమ్మద్ జహీర్ అహ్మద్ బృందం మొదటి స్థానంలోనూ, డి.సీతామహాలక్ష్మి బృందం రెండవ స్థానంలోనూ నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులందజేశారు. వీఎస్‌యు వైస్‌ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు, సెట్నెల్ సీఈఓ ఎ.నాగేశ్వరరావు, డీకె ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.గిరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రమణారెడ్డి, జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి, సెట్నెల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్, కల్చరల్ కన్వీనర్ ఈశ్వరమ్మల ఆధ్వర్యంలో ఈ యువజనోత్సవాలు జరిగాయి.

# పెద్దాసుపత్రిని పరిశీలించిన.. కేంద్ర బృందం

నెల్లూరులోని జీజీహెచ్ (ప్రభుత్వ పెద్దాసుపత్రి)లో వసతులు ఎలా ఉన్నాయి..ఇంకా ఎలాంటి వసతులు కావాల్సి ఉంది అనే అంశాలను ఇటీవల జాతీయ హెల్త్‌మిషన్‌కి చెందిన అయిదుగురు సభ్యులున్న కేంద్రబృందం ఆరా తీసింది. వార్డుల్లో ఉన్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవలను తెలుసుకుంది. ట్రామాకేర్, బ్లడ్‌బ్యాంకు తదితరాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి ఇంకా ఎలాంటి పరికరాలు అవసరమో గమనించారు. ఎన్‌హెచ్ఎం నుంచి డాక్టర్ పర్వీన్ సుల్తానా, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 22 31.10.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### ఆరోపణలు పీక్ - విచారణలు వీక్

# ఆరంభ శూరత్వం.. అన్నింటా అలసత్వం!

## కేసుల దర్యాప్తులో కూటమి ప్రభుత్వం మీనమేషాలు

## అరెస్టులు, బెయిళ్ళకే పరిమితమవుతున్న వైనం

## అధికారుల్లోనూ 'మళ్ళీ జగన్ వస్తే..?' అన్న భయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి 'మూడు పువ్వులు... ఆరు కాయలు' అన్న చందంగా వర్ధిల్లిందని అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, జనసేత అధినేత పవన్ లెక్కకుమిక్కిలి విమర్శలు చేశారు. గ్రావెల్ నుంచి గ్రానైట్ వరకు, సారా నుంచి స్కాచ్ వరకు, జగనన్న కాలనీల నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు, రేషన్ బియ్యం తరలింపు నుంచి అటవీ భూముల ఆక్రమణ వరకు ప్రభుత్వ ధనాన్ని జగన్ పార్టీ నేతలు అడ్డగోలుగా దోచేశారంటూ ఆరోపించారు. అదే ఆరోపణలని జనం మెదళ్ళలోకి ఎక్కించి 2024 ఎన్నికలలో అనూహ్య విజయం సాధించారు. జగన్‌కి ప్రతిపక్ష హోదా సైతం దక్కని స్థాయిలో వైసీపీని ఓడించారు. గత ప్రభుత్వ అవినీతి భాగోతాలన్నీ క్షేత్రస్థాయిలో నిరూపిస్తామంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విచారణలకు సైతం ఆదేశించారు. కొన్ని కేసుల్లో పలువురి నాయకులను అరెస్టు కూడా చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, ఆ తర్వాతే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆరోపణలన్నీ కేసుల నమోదుకే పరిమితమవుతున్నాయి. అరకొర అరెస్టులు చేస్తున్నా వాటిలో నిందితులంతా బెయిల్‌పై బయటకి వచ్చి, మళ్లీ చక్రం తిప్పుతున్నారు.

11లో

## పేరుకే ప్రభుత్వం - ప్రైవేట్‌దే పెత్తనం!

▶ ఎఫ్.సిల మంజూరులో డమ్మీగా మారిన రవాణా శాఖ 14లో




కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు

నిర్యాణం: 01-11-2013

12వ వర్ధంతి



అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి

ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కుమారుడు

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు లోక్‌సభ సభ్యులు

లాయర్
అక్టోబర్ 31, 2025

# కనుమరుగైపోతున్న.. సామాజిక బాధ్యత!

కాకుల్ని మనం చీదరించుకుంటుంటాం కానీ, నేటి ఆధునిక సమాజంలో లోకుల కంటే ఆ కాకులే మేలనే పరిస్థితి కనిపిస్తోంది. ఒక కాకి చచ్చిపోతే చుట్టుపక్కల కాకులన్నీ గోల చేస్తాయి. కానీ, మనుషులెందరు చనిపోతున్నా.. మనకెందుకులే అని చూస్తూ పోయేవారే తప్ప, ఏమైందని అడిగే కనీస మానవత్వం కూడా లోపిస్తోందిప్పుడు. మొన్నటికి మొన్న కర్నూలు వద్ద అత్యంత ఘోరంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కావేరీ ప్రైవేట్ స్లీపర్ బస్సు నిట్టనిలువునా తగలబడిపోవడం పెను సంచలనం కలిగించింది. అయితే, ఇంతటి ఘోరం జరుగుతున్నా ఆ దారినపోయే వాహనాల వారు అనేకమంది చూస్తూ వెళ్ళిపోయారే తప్ప, పట్టించుకున్నవారు లేకపోవడం మరింత విచారకరం. అంతేకాదు, సమాజంలో సామాజిక బాధ్యత అనేది కనుమరుగైపోతుందనడానికి ఈ ఘటనే నిలువెత్తు నిదర్శనమని చెప్పవచ్చు. ఫూటుగా మద్యం సేవించి రాత్రి 2.30 గంటల ప్రాంతంలో లైటు లేని బైకుమీద ఇద్దరు యువకులు వేగంగా ప్రయాణించడం, జాతీయరహదారిపై డివైడర్‌కి ఢీకొట్టి ఒకరు చనిపోవడం, రెండోవ్యక్తి చనిపోయిన ఆ స్నేహితుడిని రోడ్డు పక్కకు లాగేసి, బైక్‌ని మాత్రం నడిరోడ్డుమీదనే వదిలి వెళ్ళిపోవడం ఎంతటి బాధ్యతారాహిత్యమో చెప్పలేం. రోడ్డుమీద పడివున్న ఆ బైక్‌ని వేగంగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టి ఈడ్చుకుంటూ పోతుండగా మంటలు చెలరేగి బస్సుమొత్తం తగలబడిపోవడం, 19మంది ప్రయాణీకులు మంటల్లో మలమలమాడుతూ సజీవదహనం కావడం ఎంత ఘోరం!..డ్రైవర్ ఎక్కేందుకు దిగేందుకు ఉండే డోర్ ఏడాది కాలంగా చెడిపోయి, తీయడానికి రాకుండా మూతపడి ఉందంటే బస్సు యజమానులు ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నారో చూడండి. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు చూసేందుకు ఆకర్షణీయంగా ఉంటాయే తప్ప, ఆ బస్సుల్లో భద్రత ఉండదని, వారికి కావాల్సింది 'ఎన్ని టిక్కెట్లు' వచ్చాయనే డబ్బు లెక్కలు తప్ప, ప్రయాణీకులను కనీసం మనుషులుగా కూడా పరిగణించరని కావేరీ బస్సు దుర్ఘటన చెప్పకనే చెప్తోంది. బస్సు యజమానుల దురాశ, బస్సు నడిపేవారి నిర్లక్ష్యం, బైకర్ తాగుబోతుతనం, ఆయన మిత్రుడి నిర్వాకం అన్నీ కలసి వెరసి, ఆదమరచి నిద్రపోతున్న ప్రయాణీకులను మంటల్లోకి నెట్టేశాయి. ఆ పాపానికి, ఆ ఘోరానికి, ఆ నేరానికి, ఆ దారుణానికి ఎవరిది బాధ్యత?..కర్మ అనో..విధిరాత అనో సరిపెట్టుకుందామా?.. నడిరోడ్డుమీద కాలిపోయి అస్థిపంజరంలా నిలిచిన ఆ బస్సు సాక్షిగా.. ఇందులో అన్నీ మానవ తప్పిదాలే కనిపించడం లేదా?.. నిత్యం లక్షల వాహనాలు తిరిగే జాతీయ రహదార్లకి అందుబాటులో మద్యం షాపులు ఎందుకు ఉంటున్నట్లు?.. నిబంధనల ఉల్లంఘనలు, భద్రతా లోపాలు, పనిచేయని సాంకేతిక పరికరాలు, వేగ పరిమితులను పట్టించుకోకపోవడాలు, చివరికి అగ్నిప్రమాదాలను నివారించే సామగ్రి లేకపోవడాలు వంటి వాటిని ఎవరు పట్టించుకుంటున్నారు?.. ఇవన్నీ లోపాలు కాదా?..సరైన శిక్షణ లేని డ్రైవర్లు బస్సులు నడుపుతుండడం, ప్రయాణీకుల పాలిట కాలయముళ్ళుగా మారుతుండడం ఇప్పుడేమీ కొత్త కాదుగా! గతంలోనూ ఇలాంటి దుర్ఘటనలెన్నో జరిగాయి. ఎవరిమీద ఎలాంటి చర్యలు తీసుకున్నారు?.. ఈ దారుణాలకి అంతం ఎప్పుడు?.. పాలకులకీ..ప్రభుత్వాలకివేమీ పట్టవా?.. అంటూ ఘోషించే సామాన్యప్రయాణీకుల గోడు వినేదెవ్వరు?.. సాక్షాత్తూ అంత పెద్ద జాతీయ రహదారిపై అడ్డంగా ఒక బైక్ పడి ఉంటే, చూసినవారు ఎవరో ఒకరు దానిని రోడ్డు పక్కకు జరిపివుంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఉండేదా?..మానవ నిర్లక్ష్యానికి, నిర్బాధ్యతకి ఇంతకంటే ఉదాహరణ ఇంకేం కావాలి?. నడిరోడ్డుమీద బైక్ పడిఉంటే, పక్కనే డివైడర్ ఢీకొట్టి ఒకరు చనిపోయి ఉంటే, అది గమనించిన వాహనాల వారైనా ఒక్క నిమిషం ఆగి..పరిస్థితిని విచారించి ఉంటే, అంతటి ఘోరం జరిగి ఉండేదా?..కాకులైతే ఎంత గోల చేసేవో కదా!.. ఒకవేళ వాహనాల నుంచి తాము దిగి రాలేకపోయినా, చెవుల్లో ఎప్పుడూ ఫోన్లుంటాయి కదా.. కనీసం వెంటనే పోలీసులకు సమాచారమైనా ఇచ్చి ఉండొచ్చు కదా!..అంతేకాదు, నిర్లక్ష్యపు బస్సులనే కాదు..తాగి, రోడ్డుమీద బైక్ వేసుకొచ్చినవారిని నియంత్రించే పరిస్థితి కూడా లేకపోవడం మన వ్యవస్థలో మరో పెద్ద లోపం కాదా!.. ఎంతకాలం ఇలా?.. ఇంకా ఎంతమంది ఇలా దుర్ఘటనల్లో మరణించాలి?.. ఇకనైనా ఈ దౌర్భాగ్య పరిస్థితులు మారితే మంచిది. కాలిపోయిన బస్సులో రాలిపోయిన వారి ఆత్మల ఘోషతోనైనా ఈ దుస్థితులు.. ఈ నిర్లక్ష్యం.. ఈ నిర్బాధ్యత మారి, మనిషి మనిషిగా.. మానవీయంగా మారితే ఎంత బాగుణ్ణు!..

## ట్రావెల్స్ బస్సుల విషయంలో నిబంధనలు కఠినతరం చేయాలి!

మొన్న గురువారం కర్నూలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం తల్చుకుంటే కడుపు తరుక్కుపోతోంది. ఇది ముమ్మాటికి మానవ తప్పిదమే. నిరక్షరాస్యుడైన డ్రైవర్‌ని ఉద్యోగంలో పెట్టుకున్న ట్రావెల్స్ యాజమాన్యం ఈ దుర్ఘటనకు బాధ్యత వహించాలి. ముందుగానే ప్రమాదానికి గురై రోడ్డుకి అడ్డంగా పడివున్న మోటారుబైక్‌ని ప్రమాదానికి గురైన బస్సుకంటే ముందుగా 19 వాహనాలు తప్పించి వెళ్లాయని దర్యాప్తు ఆధికారులు చెప్తున్నారు. వీ కావేరి డ్రైవరు మాత్రం వాహనాన్ని మోటారుబైక్ పైకి ఎక్కించడమే కాకుండా 200 మీటర్లు ఈడ్చుకుని వెళ్లాడని దర్యాప్తులో తేలిందట. ఇది ఖచ్చితంగా డ్రైవర్ నిర్లక్ష్యమే అని అధికారులు తేల్చారు. చదువు సంధ్యా లేని ఒక మొరటి వ్యక్తి చేసిన తప్పు 19 నిండు ప్రాణాలని బలి తీసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్ విషయంలో ప్రభుత్వం మేల్కోవాలి. నిబంధనలని కఠినతరం చేయాలి. ట్రావెల్స్ యాజమాన్యాల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి. ముఖ్యంగా స్లీపర్ బస్సులలో అత్యవసర పరిస్థితులలో అవసరమైన అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారా లేదా? అన్న విషయం క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు ఇవ్వాలి.

– జీ.వీ.సుబ్బయ్య, పిడుగురాళ్ళ.

## రెచ్చిపోతున్న కుక్కల సైన్యం... ప్రభుత్వ చర్యలు శూన్యం!

గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కల విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణం. తరచూ ఎక్కడో ఒకచోట అభం శుభం తెలియని చిన్నారులు ఈ కుక్కల దాడికి బలవుతూనే ఉన్నారు. తాజాగా కూడా రాష్ట్రంలో అనేకచోట్ల కుక్కలు దాడి చేసిన సంఘటనలు వెలుగు చూశాయి. ఉదయం పూట నడకకి వెళ్ళే పెద్దవాళ్ళకి సైతం ఈ కుక్కల బెడద తప్పడం లేదు. ఒక్కొక్క చోట అయిదు నుండి పది కుక్కలు గుంపుగా చేరి జనం మీద విరుచుకుపడుతున్నాయి. నెల్లూరు నగరంలో బాలాజీనగర్, రామ్మూర్తినగర్, జగదీష్‌నగర్, మాగుంట లేఅవుట్, ఫత్తేఖాన్ పేట, మూలపేట, రంగనాయకులపేట, చిన్నబజార్, పెద్ద బజార్, జెండా వీధులతో పాటు ఇతర అనేక ప్రాంతాలలో ఇదే పరిస్థితి. మునిసిపల్ అధికారులు చొరవచూపి ఈ కుక్కల నుండి జనానికి విముక్తి కల్పించాలని కోరుతున్నాను.

కే.లక్ష్మణ్‌సింగ్, మూలాపేట.




## సైబర్ నేరాలపై హెచ్చరించినా అప్రమత్తం కాలేకపోతున్నారు!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాల పట్ల నిత్యం ప్రజలని హెచ్చరిస్తూనే వున్నాయి. సెల్‌ఫోన్లలో మెసేజీలు పంపుతున్నాయి. పత్రికలలో ప్రకటనలు ఇస్తున్నాయి. సినిమా హాళ్లలో స్లైడ్‌లతో పాటు వీడియోల ద్వారా ప్రజలని చైతన్య పరుస్తున్నాయి. అయినా, నిత్యం ఎక్కడో ఒకచోట అమాయకులు ఈ సైబర్ ముఠా వలలో చిక్కుకుంటున్నారు. సైబర్ క్రిమినల్స్ విషయంలో మనం అప్రమత్తంగా ఉండాలి. కొత్త నంబర్లు ఎత్తుకోకూడదు. వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదు. బెదిరింపులకి భయపడకూడదు. అలాంటి కాల్స్ వచ్చిన వెంటనే ప్రభుత్వాలు సూచిస్తున్న నంబర్లకి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. ప్రజలారా పారాహుషార్!

ఐ.రవికుమార్‌రెడ్డి, చెన్నై.

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 114

## దైన్యం.. దయనీయం.. దివ్యాంగుల జీవితం!

సృష్టిలో ఉన్న అనంత కోటి జీవులలో మానవ జన్మ అత్యంత ఉత్కృష్టమైనది. గత జన్మల పుణ్యఫలమే మానవ జన్మ అని మేధావులు తరచూ చెప్తుంటారు. అలాంటి మానవ జన్మలో అత్యంత దయనీయమైనది అంగవైకల్యంతో పుట్టడం. ప్రపంచవ్యాప్తంగా నిత్యం కొన్ని కోట్లమంది అంగవికలులుగా జన్మిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా మన దేశంలో కూడా వారికి కొదవేలేదు.

మన దేశంలోని దివ్యాంగుల కష్టాలకి హద్దే లేదు. ప్రజాస్వామ్య దేశమైన స్వతంత్ర భారతదేశంలో కన్నీళ్ళతోనే వారి జీవనాలు సాగుతున్నాయి. అనునిత్యం ఎనలేని బాధలతో వారి బతుకులు అత్యంత దుర్భరంగా, దయనీయంగా ఉంటున్నాయి. శరీరాలున్నా కదలలేని దుస్థితి. కళ్ళున్నా చూడలేని పరిస్థితి. కాళ్ళున్నా నడవలేని స్థితి. చెవులున్నా వినలేని దుర్గతి. పుట్టుకతోనే అవయవాల లోపంతో కొందరు, పుట్టిన తర్వాత దురదృష్టవశాత్తూ ఏ ప్రమాదాల్లోనో అవయవాలను పోగొట్టుకున్నవారు మరికొందరు. నడుములు లేక బతికినంతకాలం గోడకి జారబడి బతికేవారు, రెండు కాళ్ళూ లేక నేలమీద కూలబడి ఉండేవారు, అంధులుగా చీకటిలోనే అలమటించేవారు, ఇలా ఎంతోమంది దీనులు దేశంలో కోట్ల సంఖ్యలోనే ఉన్నారు. వారిని చూస్తే హృదయం ద్రవించిపోతుంటుంది. వారి అసహాయస్థితి కంటనీరు తెప్పిస్తుంది. దైవం తమని శాపగ్రస్తులని చేసినా, పుట్టిన తర్వాత జీవించక తప్పదు కాబట్టి, జీవచ్ఛవాల్లా బ్రతుకుబాట సాగిస్తున్న అంగవికలులు దేశవ్యాప్తంగా కోకొల్లలు. అంగవైకల్యానికి లింగ భేదం లేదు, వయో భేదం అంతకంటే లేదు. అత్యంత కఠినాత్మకంగా విధి వారి తలరాతని రాసింది. తమ బతుకులింతే అనుకుంటూ, తమలో తామే కుమిలిపోతూ దేశంలో లక్షలాదిమంది దివ్యాంగులు నిత్యం వేదనతో, రోదనతో ఎవరికీ చెప్పుకోలేని ఆవేదనతో జీవితాలు గడుపుతున్నారు.

### దివ్యాంగుల కోసం అనేక పథకాలు!

దేశవ్యాప్తంగా దివ్యాంగులు కనీసం 3 కోట్లకు పైగానే ఉంటారని అనేక సర్వేల అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశం మొత్తం మీద 2.68 కోట్ల మంది దివ్యాంగులున్నారని, వారిలో 1.18 కోట్ల మంది మహిళలు, 1.5 కోట్ల మంది వరకు పురుషులు ఉన్నారని గణాంకాలు చెప్తున్నాయి. అందులో, వైకల్యంతో కదలలేని వారు 20శాతం మంది వరకు ఉన్నారు. దృష్టి లోపంతో 19శాతం మంది, వినికిడి సమస్యతో బాధపడేవారు మరో 19శాతం మంది, ఇతరత్రా అనేకరకాల వైకల్యాలతో 8శాతం మంది వరకు ఉన్నట్లు ఆనాటి లెక్కలు తెలియజేస్తున్నాయి. ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు ఆ సంఖ్యలన్నీ నిస్సందేహంగా రెట్టింపుగా మారినా ఆశ్చర్యపోనవసరం లేదు. వీరితోపాటు అదనంగా మానసిక వైకల్యంతో బాధపడేవారి సంఖ్య కూడా అత్యధికంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో, దివ్యాంగులకు చేయూతనివ్వడానికి కేంద్రప్రభుత్వంతో పాటు, ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా ఎంతోకాలం నుంచి పలు పథకాలను రూపొందించాయి. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, జీవనభృతికి పింఛన్లు, వైద్యంలో రాయితీలు.. ఇలా పలు పథకాలతో వారిని ఆదుకుంటున్నాయి కూడా. అయితే, ఆ పథకాలను సరిగా పర్యవేక్షించేవారు లేకపోవడంతో అవి ఏ కొందరికో తప్ప వందశాతం అందరికీ అందడం లేదు. కొన్ని పథకాల అమలు లోపభూయిష్టంగా ఉండడం వల్ల అవి అసలైన దివ్యాంగుల దరికి చేరడం లేదు. ఆయా పథకాల పట్ల, వాటి వినియోగం పట్ల సరైన ప్రచారం లేకపోవడం, వాటిని వారు ఉపయోగించుకునేలా చూసేవారు కరువవడంతో, అసలే అసహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులు వాటిని సరిగా అవగాహన చేసుకోలేకపోతున్నారు. తమకోసం చాలా పథకాలున్నాయని తెలిసినవారు కూడా తక్కువే. ఒకవేళ తెలిసినా వాటిని ఉపయోగించుకుంటున్నవారు అంతంతమాత్రమే. ఒకవైపు పేదరికంతో, మరోవైపు వైకల్యంతో పడే అవస్థలతో వాటి వైపు చూడలేకపోతున్నారు. ఆ పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో కూడా తెలియని వారు లక్షల సంఖ్యలోనే ఉన్నా ఆశ్చర్యం లేదు. ప్రభుత్వాలు, పాలకులు ఇకనైనా ఈ లోపాలను సరిదిద్దాలి. పథకాలు అర్హులైన దీనులందరికీ అందేలా పటిష్టమైన ప్రణాళికలు అమలుచేయాలి.

### ఆత్మవిశ్వాసంతోనే ముందుకు.. ముమ్ముందుకు :

జీవితాన్ని కష్టాలమయంగా చేస్తున్న వైకల్యాన్ని అధిగమించి, అంతులేని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోతున్న దివ్యాంగులు కూడా గణనీయమైన సంఖ్యలోనే ఉండడం హర్షదాయకం. వారి జీవితాలు అందరికీ స్ఫూర్తిదాయకం కూడా. ఎంతో క్రమశిక్షణతో, నిజాయితీతో వారు రైల్వే తదితర ప్రభుత్వశాఖల్లోనే కాకుండా, పెద్దపెద్ద ప్రైవేటు సంస్థల్లో కూడా పనిచేస్తున్నారు. ఎన్ని శారీరక, మానసిక, ఆర్థిక బాధలున్నా లెక్కచేయకుండా బాగా చదువుకుని, మంచి ఉద్యోగాల్లో ఉంటూ, సమాజంలో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. అలాంటివారిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. ప్రభుత్వాలు కూడా దివ్యాంగుల పట్ల మరింత ఆదరణ చూపాలి. వారి హక్కుల పరిరక్షణకు తోడ్పాటునివ్వాలి. అన్ని ఆసుపత్రుల్లో వారికి ఉచిత వైద్యం అందేలా చూడాలి. ఉపాధి, ఉద్యోగావకాశాల్లో అన్ని రంగాల్లో మరింత ప్రాధాన్యత కల్పించాలి. దివ్యాంగుల కుటుంబాలకు ఆసరాగా ఉండాలి. ముఖ్యంగా, ప్రతి ఒక్క దివ్యాంగుడూ ఇబ్బందిలేకుండా జీవించేందుకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేయాలి. అందుకు దాతలు, స్వచ్ఛంధసంస్థలు కూడా తమవంతు సహకరించాలి. జాలితో కాక, మానవతా హృదయంతో ప్రతిఒక్కరూ వారికి ఆదరహస్తం అందించినప్పుడే, దివ్యాంగుల జీవితాలు వెలుగులతో ప్రకాశిస్తాయి!

- రాజశ్రీ



పూజ్య గురువులు శ్రీశ్రీశ్రీ మహావతార్ బాబాజీ

DIVYA BABAJI SUSHUMNA KRIYA YOGA FOUNDATION
SUSHUMNA KRIYA YOGA

# దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్

ఆహ్వానము



పూజ్య గురువులు శ్రీశ్రీశ్రీ భోగ సిద్ధర్



కార్తీక పౌర్ణమి సందర్భంగా... పూజ్య గురువులు

## శ్రీశ్రీశ్రీ ఆత్మానందమయి అమ్మగారిచే

# సుషుమ్న క్రియా యోగ ధ్యాన కార్యక్రమము

నవంబర్ 4 మంగళవారం సాయంత్రం 5.00 గం.

VPR కన్వెన్షన్ సెంటర్ గొలగమూడి రోడ్డు, నెల్లూరు.

గౌరవ అతిథులు



పద్మభూషణ్
డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి గారు



దేవాదాయ శాఖామాత్యులు
ఆనం రామనారాయణరెడ్డి గారు



నెల్లూరు పార్లమెంటు సభ్యులు
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు



కోవూరు శాసనసభ్యురాలు
వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గారు



సర్వేపల్లి శాసనసభ్యులు
సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గారు

కార్యక్రమ వివరాలు :

సుషుమ్న క్రియా యోగ ధ్యాన పరిచయం
నాసికా వేణుగానాలు
అన్నమాచార్య సంకీర్తనలు
ప్రజంటేషన్ - "Science of Meditation"
గురుమాతతో ధ్యాన సాధన కార్యక్రమము

ప్రవేశం ఉచితం

అందరూ ఆహ్వానితులే!

వివరాలకు :
8904110736, 87548 97586
https://divyababajikriyayoga.org

ఈ విశ్వంలోని ప్రాణ కోటికి మంగళం నిత్య శుభ మంగళం

# సర్వేపల్లి రిజర్వాయర్‌ని పరిశీలించిన సోమిరెడ్డి



మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రమాదకరంగా మారిన సర్వేపల్లి రిజర్వాయర్‌ని ఈనెల 29న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిశీలించారు. జోరు వానలో ఆయన ఆ రిజర్వాయర్ కట్టపైకి వెళ్లి పరిస్థితిని గమనించారు. కనిగిరి రిజర్వాయర్ తర్వాత ఇదే పెద్ద చెరువని, దీనికింద 25 వేల ఎకరాలకు పైగా సాగవుతుందని ఆయన తెలిపారు. రిజర్వాయర్ కట్ట ప్రమాదకర పరిస్థితిలో ఉంటే ఇటీవలే పలు చోట్ల గండ్లు పూడ్చి మరమ్మతులు చేయించామన్నారు. గత ప్రభుత్వంలో దీని మరమ్మతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక దీని ఆధునికీకరణ పనులు అత్యవసరంగా చేపట్టాలని ప్రభుత్వానికి నివేదించామని, త్వరలో నిధులు మంజూరవుతాయని చెప్పారు. అదేవిధంగా, మనుబోలు మండలంలో 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే దేగపూడి-బండేపల్లి కాలువను, సర్వేపల్లి కాలువను, తిరుమలమ్మపాళెం హైలెవల్ బ్రిడ్జిని కూడా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు.

ఇంకా, అమ్మవారిపాళెం పెద్దచెరువు, ప్రభగిరి పట్నం, కందమూరు చెరువులకు నీళ్లు అందించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోని ఆ పనులన్నిటినీ ఇప్పుడు మళ్ళీ ప్రారంభించాల్సి ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి 'విశ్వ సముద్ర' పరిశ్రమ వద్దకు వచ్చినప్పుడు ఆ పెండింగ్ పనులను వివరించి, సమస్యలు తెలియజేస్తూ వినతిపత్రాలు సమర్పించానన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో అన్ని పనులకు నిధులు సాధించుకుని వాటిని త్వరలోనే పూర్తి చేస్తామనే నమ్మకం ఉందన్నారు. నవంబర్ నెలలో కూడా బాగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## చింతారెడ్డిపాళెం వద్ద వంతెన కోసం ఆందోళన

నెల్లూరు నగరంలోని చింతారెడ్డిపాళెం కూడలి వద్ద జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన నిర్మించాలంటూ ఎంతోకాలంగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ, ఫ్లైఓవర్ సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇటీవల ధర్నాందోళన చేశారు. జాతీయ రహదారిపై జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ, ఈ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది ప్రాణలు కోల్పోయారని చెప్పారు. వెంటనే ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ ఆందోళనలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు పెంచలనరసయ్య, శంకర్, కొట్టే రామమూర్తి, గురుబ్రహ్మం, శివకుమార్‌రెడ్డి, పరశురామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, షంషుద్దీన్, కట్టా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



### అధికారుల అప్రమత్తతతో..

# సంగం బ్యారేజీకి తప్పిన ముప్పు!

జిల్లా అధికారుల అప్రమత్తతతో సంగం బ్యారేజీకి ముప్పు తప్పింది. మొంథా తుఫాన్ ప్రభావంతో ఈ బ్యారేజీ లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహంతో ఉరకలు వేస్తున్న వేళ, బుధవారం వేకువన హటాత్తుగా ఓ 30 టన్నుల బరువున్న ఓ భారీ బోటు ఆనకట్ట క్రస్ట్‌గేటు వద్దకు చేరుకుంది. ఈ సమాచారం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల అప్రమత్తమై, ప్రమాదకర స్థితిలో అక్కడ ఆగిన ఆ బోటును ఒడ్డుకు చేర్చేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేశారు. 30మంది ఎన్‌డిఆర్ఎఫ్ సభ్యులు, వందమంది పోలీసులు, కృష్ణపట్నం పోర్టు గస్తీ సిబ్బంది, ఆత్మకూరు ఆర్డీఓ, సోమశిల ప్రాజెక్టు అధికారులు, అగ్నిమాపకశాఖ, నీటిపారుదలశాఖల అధికారులు అందరూ హుటాహుటిన తరలివచ్చి, ఆ బోటును ఒడ్డుకు తెచ్చేందుకు ఎంతో శ్రమించారు. పొరపాటున ఆ బోటు బ్యారేజీకి తగిలితే, బ్యారేజీ దెబ్బతిని పరిస్థితి ఊహించని విధంగా భారీస్థాయిలో నష్టం కలిగించి ఉండేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్లయితేనేం..బ్యారేజీని ఆ పడవ ఢీకొట్టకుండా అక్కడే స్థిరంగా ఉండేలా చేసి, ఆ తర్వాత దానిని మెల్లగా..చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు.

సంగం బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఇసుక తీసేందుకు కాంట్రాక్టర్లు తీసుకొచ్చిన భారీ డ్రెడ్జింగ్ పడవలు బీరాపేరు వాగు వద్దకి కొట్టుకువచ్చి, పాత ఆనకట్ట క్రస్ట్ గేట్‌కి ఢీకొట్టాయని, వాటిలో ఓ పడవ అక్కడే ఆగిపోగా మరో రెండు పడవలు పాత కనిగిరి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద నిలచిపోయాయని స్థానికుల సమాచారం. ఆ పెద్ద పడవ అక్కడ ఆగకపోయి ఉంటే అది నేరుగా కొత్త బ్యారేజీ ఢీకొని పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని అంటున్నారు. ఏదేమైనా, 85 గేట్లతో ఉండి, 3,85,000 ఎకరాల ఆయకట్టుతో బీడు భూములను సస్యశ్యామలం చేస్తున్న సంగం బ్యారేజ్‌కి ఏదైనా ప్రమాదం జరిగి ఉంటే, ఆనీరంతా వృధాగా పోయి రైతులకెంతో నష్టం జరిగి ఉండేది కూడా. అధికారులు అప్పటికప్పుడు స్పందించి ఈ ముప్పు నుంచి బ్యారేజీని తప్పించడంతో రైతులు, స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

# మరో చక్కని వెన్నుదన్ను భాస్కర్‌బాబు 'మూడోకన్ను'

ఆయన కవితా ప్రక్రియలోకి అడుగిడి ఒక్కసారిగా విజృంభించి వినువీధుల కాంతివంతమై, వెలుగుదీపమై అన్యాయాలు, అక్రమాల పాలిట 'మూడోకన్ను' తెరచిన అపరశివుడు మన భాస్కరుడు. శివుడికే కాదు విష్ణువుకు కూడా మూడోకన్ను తెరిచే అద్భుత సమయం వస్తుందని, తన కవిత్వంతో సమాజాన్ని మేల్కొలిపే వచస్సు, హవిస్సు తన సొంతమని తొలికవితా సంపుటికే ప్రకటించిన ఆర్.ఎం.వి.భాస్కరబాబు అభినందనీయులు.

నిష్క్రియాపరత్వం నుంచి చైతన్యం వైపు అడుగులు వేసిన వినూత్న కవి భాస్కరబాబు 'లాయర్' వారపత్రికకు పాతకాపు కావడం విశేషం. ఆయన అన్నగారు కీ॥శే॥ ఆర్.ఎం.ఎస్.ప్రకాష్‌బాబు 'లాయర్'లో కొలువుదీరిన సంఘటన, సోదరుడు ఆర్.ఎం.ఉమామహేశ్వరరావుది 'లాయర్' హస్తవాసే అయిన ఘటనతో వారిరువురూ 'లాయర్' అందించిన దీపాలుగా దేదీప్యమానమయ్యారు. ఇప్పుడు కవితా లోకంలోకి అడుగిడిన ఆర్.ఎం.వి.భాస్కర్‌బాబు 'నాదేశం వజ్రపు చొక్కా తొడుక్కొని మెరసిపోతోంది' అంటూ సగర్వంగా ప్రకటిస్తున్నారు. దేశం ఎడల ఎంతో ప్రేమతో, వ్యంగ్యం తన ఉద్దేశమైన కవితతో.




రచయిత : ఆర్.ఎం.వి.భాస్కర్‌బాబు
సెల్ : 7661024370
వెల : రూ. 125/- పేజీలు : 116
ప్రతులకు: ఆర్.ఎం.వి.భాస్కర్‌బాబు
8-5-280, 2వ వీధి, సాయినగర్,
సూళ్లూరుపేట. సెల్ : 98491 66103

చెత్తకుండీల్లో ఎంగిలి మెతుకులు ఏరుకుంటున్న ఆకలి కడుపుల చీకట్లో ఆనందంగా అపురూపంగా మెరిసిపోతుందట. పరువు హత్యల్లో ఏరులై పారుతున్న కులాంతర జంట నెత్తుటి కౌగిళ్ళలో తడిసిపోతోంది అని చెప్తూ. కరిమింగిన వెలగపండు లాంటి ప్రజాస్వామ్యం ఖూనీ అయిన అసందర్భాన్ని ఉటంకిస్తూ కవిగా ఎలుగెత్తి చాటుతున్నాడు, ప్రజాస్వామ్య ఉనికి కోసం వెంపర్లాడుతున్నాడు.

భరతమాత చీకటిని చుట్టుకొని అలమటిస్తూ అర్థిస్తోంది. తనకు వెలుగు వస్త్రం కప్పమని, మరలా పోగొట్టుకొన్న స్వాతంత్ర్యం సంపాదించుకొనే స్వాతంత్ర్య సమరయోధులు కమ్మని ఆశావహ గీతం 'వెలుగు వస్త్రం కప్పండి' అంటూ రాసిన కవితలోని భావోద్వేగం మనకు మృగాళ్ళ కామానికి కాలిపోతున్న ఆడబిడ్డ పతనం, బడుగుజీవుల నోటి కాడ కూడు గుడ్డ తన్నుకుపోయే వ్యధనం గుర్తుకుతెస్తుంది.

'ప్లీజ్' కవితలో భాస్కరబాబు అంతరంగం వినిపించాడు. మనిషి లేడని, వెతకండని ఓ కవి ఆవేదనతో చెప్పిన సంగ్రహాన్ని 'భూమాత ఆవేదనగా ఎదురుచూస్తోంది స్వార్థం లేని మనిషి కోసం' నా కళ్ళ అన్వేషణ అదేనని ఎరుకపరుస్తారు కవి. దిబ్బని కెలికే కోడిలా శవాన్ని కోసి పంచనామా చేసే వైద్యుడిలా సాగుతున్న తన అన్వేషణ నిండైన మనిషి కోసం, మానవత్వపు జాడ కోసం అని ఎంతో ఆర్తిగా చెప్తారు. మనిషి కోసం కవి పడే ఆవేదన భాస్కరబాబు కవితా స్పృహకు తార్కాణం.

శరీరం నిండా శరాలతో కాంక్రీటు పాదాల క్రింద సమాధైన పొలాల్ని గురించి కవి పడ్డ ఆవేదన 'చివరగా ఒక్క మాట' కవితలో! సమాధులైపోతున్న పొలాలు మనిషికి బువ్వనివ్వవని గ్యారెంటీగా చెప్తున్నాడు. 'రైతు పాదాలకు మొక్కుతూ' ఒ కవిత రాసారు కవి. దగాపడినా దిగాలు పడక జనం ఆకలి తీర్చేందుకు మళ్ళీ మళ్ళీ తన కండలు కరిగించి ముద్దనోట్లో పెట్టే కృషీవలుడు రైతని చెప్తూ సమాజానికి కరివేపాకు అని కల్లోలమవుతాడు భాస్కరబాబు.

ఇలా ప్రతి కవితా ఓ సామాజిక నేపథ్యంతో జన నైవేద్యమై జాగృత గీతం పాడిన కవి గొంతుకలో మార్దవం ఉంది. సామాజిక చైతన్య ధృక్పథం ఉంది. అయితే, మరింత అధ్యయనంతో రాటుదేలాల్సిన అవసరం గుర్తెరిగి అడుగు వేస్తే భాస్కరబాబులో మంచి కవి మేల్కొంటారనడంలో సందేహం లేదు!

వర్తమాన కథా విధాతగా విరాజిల్లుతున్న ఆర్ఎం ఉమామహేశ్వరరావు సోదరునిగా కవితా ఆరంగ్రేటం చేసిన భాస్కరబాబు తొలి కవితా సంపుటి సూపర్‌హిట్ కావడం అభినందనీయం.



సమీక్షకులు:
**చిన్ని నారాయణరావు**
9440202942

# పుంజుతోక ఆవిష్కరణ



నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిఖార్సైన అధికారిగా పేరు గడించిన మాజీ ఐ.పి.ఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి విరచిత "పుంజుతోక" కాక్‌టెయిల్ కవితల పుస్తకం అక్టోబర్ 26న నెల్లూరు పురమందిరంలో ఆవిష్కరించబడింది. డైరెక్టర్ జనరల్ హోదాలో తెలంగాణలో పదవీ విరమణ పొందిన శ్రీనివాస్‌రెడ్డి, గతంలో నెల్లూరు ఎస్.పిగా కూడా పనిచేశారు. జిల్లా వాసులతో ఆయనకి మంచి సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన పుస్తక పునరావిష్కరణ కార్యక్రమాన్ని నెల్లూరులో కూడా నిర్వహించి, పుస్తక పరిచయం చేశారు.

# సంతకాల సేకరణలో పర్వతరెడ్డి



వైసీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ, వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన నెల్లూరు 4వ డివిజన్ జాకీర్‌హుస్సేన్ నగర్‌లో డివిజన్ ఇన్‌చార్జ్ సందాని, కోఆర్డినేటర్ మధురెడ్డిలతో కలసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. డివిజన్ కమిటీలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం వలన జరిగే నష్టాలను వివరించి కోటి సంతకాల సేకరణ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసి సంతకాలు సేకరించారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు.

# ఆధ్యాత్మిక వేదికపై.. ఆనంద వేడుక

## శృతి - తేజస్‌ల కళ్యాణం

## కమనీయం.. రమణీయం.. చిరస్మరణీయం!



శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి - శ్రీమతి వసంత, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధనరెడ్డి - శ్రీమతి రాజ్యలక్ష్మిల మనుమరాలు **శృతి-తేజస్‌**ల కళ్యాణం అక్టోబర్ 24వ తేదీ హైదరాబాదులో కడు కమనీయంగా.. రమణీయంగా.. చిరస్మరణీయంగా జరిగింది.

భారతీయ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా, ఆధ్యాత్మిక వైభవం తలపించేలా రూపొందించిన అచ్చమైన ఆలయమనిపించే అతి పవిత్ర దేవాలయ ప్రాంగణంలో, భక్తిభావంతో రూపొందించిన ఆధ్యాత్మిక వేదికపై ఈ అపురూప ఆనంద సంబరం 'నభూతో న భవిష్యత్' అనేలా జరిగింది. సంప్రదాయ మంగళవాద్యాలతో పాటు లిటిల్ మ్యుజిషియన్స్ అకాడమీ (బాల గాంధర్వం) చిన్నారులు పఠించిన శ్లోకాలు, ఆలపించిన అన్నమయ్య కీర్తనలు ఈ వేడుకకి అదనపు ఆకర్షణగా నిలిచాయి.

వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, సినీ కళా రంగాలకి చెందిన అనేకమంది ప్రముఖులు, ఇరు కుటుంబాల బంధుమిత్రులూ ఈ శుభకార్యంలో పాల్గొని కొత్త దంపతులకి తమ ఆశీస్సులు అందించారు.

శృతి-తేజస్‌లకి 'లాయర్' శుభదీవెనలు.















# నెల్లూరు కబుర్లు

## ఉక్కుమనిషి.. సర్దార్ వల్లభాయ్ పటేల్



ఉక్కుమనిషి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సర్దార్ 150 యూనిటీ మార్చ్ బ్రోచర్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కేంద్ర క్రీడా యువజన విభాగం ఆదేశాలతో ఇటీవల ఆయన నెల్లూరులోని తమ నివాసంలో యువజన అధికారి మహేంద్రతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ మహనీయుని జయంతిరోజున నెల్లూరులోని వీఆర్‌సీ మైదానం నుంచి పాదయాత్ర ఉంటుందని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## బొందిలి కులాన్ని ఓబీసీలో చేర్చాలి



బొందిలి కులాన్ని కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో చేర్చేలా చూడాలంటూ పలువురు బొందిలి సంఘం నాయకులు ఇటీవల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. అందుకు వేమిరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఆ సమస్యను వెనుకబడిన తరగతులు జాతీయ కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళి, తగు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెల్లూరు కృష్ణసింగ్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్‌సింగ్, కార్యదర్శి అల్లూరు నాగేంద్ర సింగ్, చంద్రబాన్‌సింగ్, భగవాన్‌సింగ్, బొందిలి కుల చరిత్ర పుస్తక రచయిత శ్రీధర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మిషన్‌లో..హోమియో శిక్షణ



నెల్లూరులోని మైపాడురోడ్డ మూడవమైలు వద్ద రామకృష్ణమిషన్-మాస్టర్ ఇ.కె ఆధ్యాత్మిక సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న హోమియో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సేవాసక్తి కలవారు ప్రతి శనివారం, ఆదివారం రోజుల్లో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రాథమిక హోమియో వైద్యశిక్షణా తరగతుల్లో పాల్గొనవచ్చని డా.ఇవస్ చక్రపాణి తెలిపారు. ఈ సమావేశంలో జీవీ ప్రసాద్, సికిందర్ సింగ్, భాస్కర్‌సింగ్, రామకృష్ణ మిషన్ ప్రతినిధి టి.లక్ష్మీనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 12 మంది పేదలకు 14.50 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఇటీవల టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్ఓగా..విజయకుమార్



జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా పనిచేస్తున్న ఎన్.విజయ కుమార్‌ని జిల్లా రెవిన్యూ అధికారి (డీఆర్ఓ)గా నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 27న ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి డీఆర్ఓగా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజా ఉత్తర్వులతో డీఆర్ఓగా ఆయన పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు.

## బ్రెయిన్‌స్ట్రోక్‌పై అవగాహన అవసరం

### అపోలో వైద్యుల సూచన




బ్రెయిన్‌స్ట్రోక్ పట్ల అందరికీ అవగాహన అవసరమని, ఆ సమస్యకి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు అపోలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ బిందుమీనన్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ సూచించారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా ఇటీవల ఆమేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అపోలో ఆసుపత్రిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్రెయిన్‌స్ట్రోక్‌ను ముందస్తుగా గుర్తించడం, వేగవంతంగా వైద్య సేవలు అందించడం, రోగికి మంచి ఆరోగ్యాన్ని అందించడం ఎంతో ముఖ్యమన్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో సంభవించే పక్షవాతానికి సంబంధించి ప్రతి నిమిషం ఎంతో విలువైందని, ఎంత త్వరగా రోగిని వైద్యుని వద్దకు తీసుకువెళ్తే, అంత వేగంగా పక్షవాతం నుండి బయటపడే అవకాశం ఉందన్నారు. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుఎస్ఓ) పరిశోధన కమిటీ కో-ఛైర్మన్‌గా, బోర్డు సభ్యురాలిగా డాక్టర్ బిందుమీనన్ నియమితులవడం ఎంతో గర్వకారణని ఈ సందర్భంగా కొనియాడారు. ప్రముఖ న్యూరాలజిస్టులు డాక్టర్ శివశంకర్, డాక్టర్ రష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు..రెడ్‌క్రాస్ సాయం

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నెల్లూరు నగరంలో ఇళ్ళు కోల్పోయి అసహాయస్థితిలో ఉన్నవారికి జిల్లా రెడ్‌క్రాస్ తనవంతు



సాయం అందిస్తోంది. ఇటీవల స్థానిక జనార్దన్‌రెడ్డి కాలనీ, బాలాజీనగర్‌లలో ఆరుగురి ఇళ్ళు బాగా దెబ్బతినడంతో వారికి టార్పాలిన్ పట్టలు, వంటసామగ్రి, దోమతెరలను రెడ్‌క్రాస్ వారు అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ చామర్తి జనార్దన్‌రాజు, క్యాన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ యాలమూరి రంగారావు, విపత్తుల నిర్వహణ విభాగం కోఆర్డినేటర్ దాసరి రాజేంద్ర ప్రసాద్, వలంటీర్లు బాధితులకు సాయం అందించారు.

## మంత్రి ఆనంతో..లంకా దినకర్ భేటీ



20 సూత్రాల కమిటీ ఛైర్మెన్ లంకా దినకర్ ఇటీవల నెల్లూరు పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ విజన్ 2047 అమలు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర లక్ష్యసాధన దిశగా అమలు చేయనున్న పలు కార్యక్రమాలపై వారు చర్చించుకున్నారు.

### జిల్లా అభివృద్ధిపై.. కలెక్టర్‌తో చర్చ

నెల్లూరు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అందరం కలిసి కృషి చేద్దామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు చెప్పారు. ఇటీవల నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని కలెక్టర్ హిమాన్షు శుక్ల కలుసుకున్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిపై ఇరువురు చర్చించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని మంత్రి కలెక్టర్‌కి సూచించారు.

## పరిశ్రమలకి సకాలంలో అనుమతులివ్వాలి

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సకాలంలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. ఇటీవల నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వెంటనే భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంవీ సుబ్బారెడ్డికి..అవార్డు



విద్యారంగంలో సుమారు మూడు దశాబ్దాలకు పైగానే ఉత్తమ సేవలందిస్తున్న నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలట్ స్కూల్ అధినేత ఎంవీ సుబ్బారెడ్డికి నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్ (నిసా) అవార్డు లభించింది. విశాఖపట్నంలో ఆయన ఇటీవల ఎంపీ భరత్ కుమార్ చేతులమీదుగా ఆ అవార్డునందుకున్నారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు కులభూషణ్‌శర్మ, అపస్మా చీఫ్ మెంటార్ కృష్ణారెడ్డి, ఏపీ అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్..'శతమానం భవతి'



నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న 'శతమానం భవతి' కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్‌లో పుట్టిన వాకర్స్ సభ్యులందరికీ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి సన్మానించి, ఆశీర్వచన పత్రాలు బహుకరించారు. కేకు కట్‌చేసి అందరికీ పంచారు. అసోసియేషన్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, షేక్ నజీర్ అహ్మద్, చెంచయ్యనాయుడు, బిరుదవోలు రామమోహన్‌రెడ్డి, కెవి కృష్ణారెడ్డి, రమేష్, రామరాజు, సుబ్బారావు, వెంకటరాజు, శివయ్య, ఆదినారాయణ రెడ్డి, సదానందరెడ్డి, వెంకటరమణ, సురేష్, సోను పాల్గొన్నారు.



### నవంబరు 4న నెల్లూరులో..

# సుషుమ్న క్రియా యోగ!



"దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్" యోగ ధ్యాన కార్యక్రమం నవంబర్ 4వతేదీ సాయంత్రం నెల్లూరులో జరగనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. పూజ్యశ్రీ ఆత్మానందమయి అమ్మవారు యోగ భోదన చేస్తారని చెప్పారు. మంగళవారం సాయంత్రం 5గంటలకి కార్తీక పౌర్ణమి సందర్భంగా నెల్లూరు గొలగమూడిరోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒక్క భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యోగ సాధకులు, అమ్మవారి శిష్యులు అధిక సంఖ్యలో పాల్గొనబోతున్నట్లు వారు తెలియజేశారు. తొలిసారిగా నెల్లూరులో జరుగుతున్న ఈ అరుదైన కార్యక్రమంలో నెల్లూరీయులు విశేషంగా పాల్గొని ఆరోగ్య సూత్రాలని అభ్యసించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు "పద్మభూషణ్" డాక్టర్ కే.ఐ. వరప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు గౌరవ అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

## పోస్టర్ ఆవిష్కరించిన వీపీఆర్!



ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ని పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వారి నివాసంలో ఇటీవల ఆవిష్కరించారు. ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ప్రశాంతి సుకుమార్, 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి, అమ్మవారి శిష్యులు శృతకీర్తి, సత్యనారాయణమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, శరీర దృఢత్వం వంటి అంశాలకి ఉపకరించే అతి అరుదైన "సుషుమ్న క్రియా యోగ" కార్యక్రమం నెల్లూరులో జరగడం సంతోషదాయకం అన్నారు. యోగా పట్ల ఆసక్తి ఉన్నవారు, లేనివారు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని యోగా యొక్క ప్రాధాన్యతని తెలుసుకోవాలని కోరారు. ఈ మంచి అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# బాధ్యతలు చేపట్టిన.. వేమిరెడ్డి కోటారెడ్డి



శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా నెల్లూరుజిల్లాకి చెందిన వేమిరెడ్డి కోటారెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీశైల మల్లన్నకు సేవ చేసుకునే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల కృషి ఫలితంగానే తనకు ఆ భాగ్యం దక్కిందన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సేవలందిస్తానని, సామాన్య భక్తులకు వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

# జడ్పీ అధికారుల సేవలను మెచ్చుకున్న కలెక్టర్

మొంథా తుఫాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, సిబ్బంది అన్ని ముందస్తు చర్యలు తీసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా ప్రజలకు సేవలు అందిస్తున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రశంసించారు. జిల్లాలోని 38 మండలాలలో వర్షపునీరు నిలిచే 135 లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అందులో 119 లోతట్టు ప్రాంతాలలో నిల్వవున్న వర్షపు నీటిని 78 జేసీబీలను ఉపయోగించి రూ.11.49 లక్షల వ్యయంతో 77 పనులను పూర్తి చేశారని తెలిపారు. అన్ని మండలాల్లో మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఇతర శాఖల అధికారులు విపత్తు సమయానికి ముందు, అనంతరం విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.

# పురాతన ఆలయాలకు పూర్వ వైభవం

- దేవాదాయ మంత్రి ఆనం



రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఆధ్యాత్మికత, ధార్మిక చింతన, సనాతన ధర్మ పరిరక్షణకు చిత్తశుద్ధితో తమ ప్రభుత్వం పని చేస్తోందని, పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చే కృషిలో ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 26న అనుమసముద్రంపేట మండలంలోని కావలి ఎడవల్లి గ్రామంలో శ్రీ కోదండ రామాలయం భూమి పూజ, పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ఆనం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. తొలుత, 51 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. 31లక్షలతో సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. అనంతరం భక్తులందరితో కలసి రూ.1.50 కోట్లతో శ్రీ కోదండ రామాలయం నిర్మాణానికి శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల్లో భగవంతుని ఆరాధన, ధూప దీప నైవేద్యాలు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆత్మకూరు నియోజకవర్గంలో గ్రామ దేవతల ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఒక్కొక్క ఆలయానికి రూ. 5 లక్షలు చొప్పున ఆత్మకూరు నియోజకవర్గంలో 77 గ్రామాలకు రూ. 3.85 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 17ఆలయాల పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టామని, నియోజకవర్గంలో 59 ఆలయాలకు ధూప దీప నైవేద్యం కింద ప్రతి ఆలయానికి రూ. 10వేలు ఆలయ అర్చకుని ఖాతాకు జమ చేస్తున్నట్లు చెప్పారు. టీటీడీ శ్రీవాణి నిధులతో గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని తదితరులు పాల్గొన్నారు.




### విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. 6 నుండి

# వైభవంగా లక్ష దీపోత్సవం

## • అంకురార్పణ చేసిన వేమిరెడ్డి దంపతులు



విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వైభవోపేతంగా జరిగే కార్తీక మాస లక్ష దీపోత్సవం ఈ ఏడాది నవంబరు 6,7,8 తేదీల్లో జరుగనుంది. ఆమేరకు ఈ కార్యక్రమానికి ఈనెల 26న అంకురార్పణ జరిగింది. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతుల చేతుల మీదుగా నగరంలోని వీఆర్‌సీ మైదానంలో భూమిపూజ చేసి, గుంజ ప్రతిష్టాపన, అనంతరం కార్తీకమాస లక్ష దీపోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత తొమ్మిదేళ్లుగా ఈ వేడుక జరుగుతోందని, ఇది 10వ సంవత్సరమని, జిల్లా ప్రజలు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. భక్తులు ఆధ్యాత్మిక సంతృప్తితో ఇక్కడ కార్తీక దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శనం చేసుకుని వెళ్లాలన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు.

### 6న బ్రహ్మశ్రీ చాగంటి రాక

కార్యక్రమాల్లో భాగంగా నవంబరు 6వ తేదీ తొలిరోజు ఉదయం గణపతి పూజ, ఆ తర్వాత అదే రోజు సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఉంటుందన్నారు. రెండవ రోజు శ్రీ సచ్చిదానంద సరస్వతి మహాస్వామివారి అనుగ్రహ భాషణం, 3వ రోజు శ్రీ రామానంద భారతి స్వాముల వారి ఆశీర్వచనాలతో పాటు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వైభవంగా ఉంటుందన్నారు. ఈ వేడుకల సందర్భంగా ద్వారకలో వెలసిన నాగేశ్వర జ్యోతిర్లింగ ఆలయ నమూనాను, పందరీనాథ్ దేవాలయ నమూనాను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు.

### శ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి నేతృత్వంలో...

# 'సమతా ఇష్టి' మహాయజ్ఞం



'స్వీయ ఆరాధన-సర్వ ఆదరణ'-'మాధవ సేవగా సర్వప్రాణి సేవ' అనే ధ్యేయంతో పూజ్యశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యేక పర్యవేక్షణలో నవంబరు 6 నుంచి 13వ తేదీ వరకు చెన్నైలో 'సమతా ఇష్టి' మహాయజ్ఞం నిర్వహించనున్నారు. పెరంబూరులో ఉన్న ఎస్‌పిఆర్ సిటీలో జరుగనున్న ఈ మహాయజ్ఞంలో భక్తులు స్వహస్తాలతో పెరుమాళ్లకు.. భగవద్రామానుజులకు తిరుమంజనం చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు. సాధారణంగా మనకు ఇష్టాలు ఎన్నో ఉంటాయి. వాటిని మనకు ప్రసాదించడానికి ఆ భగవంతుడు స్వయంగా శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రంలో విభిన్నంగా ఇష్టులను నిర్దేశించాడు. అలాంటి ఇష్టులను సమతా ఇష్టి మహాయాగంలో భాగంగా, ఆచార్యుల అనుగ్రహంతో జరుపుకోవడం ఎంతో అదృష్టమని సమతా ఇష్టి సేవా కమిటీ- జియ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (చెన్నై) నిర్వాహకులు తెలిపారు.

### నవంబరు 7 నుంచి మహాయాగం :

ఈ ఇష్టి కార్యక్రమాల్లో భాగంగా, నవంబరు 7న సర్వ విధ గ్రహ భయ నిర్మూలనకి, యాగసంరక్షణకి 'శ్రీ సుదర్శన ఇష్టి' పేరుతో యాగం నిర్వహించనున్నామని వారు తెలిపారు. అదేవిధంగా, నవంబరు 8న 'శ్రీ వైనతేయ ఇష్టి' (సత్ సంతాన ప్రాప్తి కోసం), 9న హయగ్రీవ ఇష్టి (సర్వ విధ విద్యాభివృద్ధి), సర్వ వ్యాధి నివారణకి 10న శ్రీ పరమేష్టి (శ్రీ ధన్వంతరి హోమంతో), సర్వత్రా విజయ ప్రాప్తి కోసం 'శ్రీ విష్వక్సేన ఇష్టి, దారిద్ర్య నిర్మూలన, సర్వస సంపదల అభివృద్ధి కోసం 'శ్రీ లక్ష్మీనారాయణ ఇష్టి' నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని స్వామివార్ల కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం ద్వారా కూటమి కుట్రలను తిప్పి కొడదామని, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందామని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని 14 వార్డుల పరిధిలో ఈనెల 27న జరిగిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ అడ్డుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు.

### వెంకటగిరి వదిలి.. నేను ఎక్కడికీ వెళ్లను

తనను నెల్లూరు ఎంపీగా పోటీకి దింపాలని అధిష్టానం భావిస్తున్నట్లుగా సామాజిక మాధ్యమాలలో వస్తున్న తప్పుడు కథనాలను నమ్మొద్దని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. వెంకటగిరి ప్రజలతో నేదురుమల్లి కుటుంబం మమేకమై ఉందన్నారు. తనకు ఎంపీ ప్రమోషన్ అవసరం లేదని, వెంకటగిరిని వదిలి తాను ఎక్కడికీ వెళ్లే ప్రసక్తే లేదని రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. తాను వెంకటగిరి బరిలోనే పోటీకి దిగుతానని, వెంకటగిరి ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుస్తానని అన్నారు. కొంతమంది పని కట్టుకొని చేస్తున్న అబద్దపు ప్రచారాల్ని ప్రజలు నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.






# కార్తీక దీపోత్సవాన్ని జయప్రదం చేయండి

## బీజేపీ నేత సురేంద్రరెడ్డి పిలుపు



సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో నవంబరు 5,6,7 తేదీల్లో జరిగే మహా కార్తీక దీపోత్సవం, సత్యనారాయణ స్వామి వ్రతాలను జయప్రదం చేయండని బీజేపీ నేత పి.సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. తొలి కార్తీక సోమవారం సందర్భంగా నెల్లూరు చెరువు వద్ద గణేష్ ఘాట్‌లో శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలచే దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సంవత్సరం మహా కార్తీక దీపోత్సవంలో భాగంగా నవంబర్ 6 తేదీ ఉదయం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం నుంచి ఉత్సవమూర్తులతో, అర్చకులతో శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. సింహపురి ప్రజలందరికీ ఇది అరుదైన అవకాశమని, గృహస్తులందరికీ ఉచితంగా వ్రత పూజా ద్రవ్యాలు అందిస్తామని తెలిపారు. 5వ తేదీ కార్తీక పౌర్ణమి రోజున మహా కార్తీక దీపోత్సవంలో పాల్గొనే భక్తులందరికీ ఉచితంగా దీపోత్సవ పూజా సామగ్రి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ కే.వెన్నెల, కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద, సరిత, జయలక్ష్మి, ప్రవీణ ఉమాదేవి, సుభాషిణి పాల్గొన్నారు. మహిళా భక్తులు నందీశ్వర హారతులు, దీప అర్చనలు, శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామి వారికి మహాదీప హారతులు నిర్వహించారు. కోడూరు జయరాం, వ్యాస్ ప్రసాద్, ఏవిఆర్ మోహన్‌రావు, హర్షవర్ధన్, కామేశ్వరరావు, మదుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

### కాలధర్మం

# తిక్కవరపు జనార్ధన్‌రెడ్డి



స్నేహశీలి, సహనశీలి తిక్కవరపు జనార్ధనరెడ్డి అక్టోబర్ 27వ తేదీ సోమవారం కన్నుమూశారు. నెల్లూరుజిల్లాలోని జగదేవిపేట ఆయన స్వగ్రామం. మాజీ రాజ్యసభ సభ్యులు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, ప్రముఖ హాస్య నటులు దివంగత రమణారెడ్డిల సొంత చిన్నాన్న కీర్తిశేషులు తిక్కవరపు దశరథరామిరెడ్డి - లీలావతమ్మల కుమారుడే జనార్ధనరెడ్డి. జనార్ధనరెడ్డి బాల్య విద్యాభ్యాసమంతా నెల్లూరు జిల్లాలోనే జరిగింది. చదువు పూర్తిచేసిన అనంతరం కాంట్రాక్టు రంగంలో కొన్ని రోజులు కొనసాగారు. ఆ రోజుల్లో అప్పర్ కృష్ణా కాలువ పనులని జనార్ధన్‌రెడ్డి చేశారు. ఆ తరువాత నిర్మాణ రంగంలో అడుగుపెట్టి తన సొంత జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలో అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్ళు నిర్మించారు. అనంతరం 1998లో తన మజిలీని హైదరాబాదుకి మార్చారు. అక్కడ తన బావమరిది బద్వేలు సుబ్బారెడ్డితో కలసి తన కుమారుడు వంశీరామ్ పేరుతో వంశీరామ్ బిల్డర్స్‌ని స్థాపించారు. దాదాపు దశాబ్దకాలం పాటు సుబ్బారెడ్డి భాగస్వామ్యంలో కొనసాగి, అనంతరం సొంతంగా వంశీరామ్ హోమ్స్ అనే సంస్థని స్థాపించి నిర్మాణ రంగంలోనే కొనసాగారు. జనార్ధనరెడ్డికి భార్య మంజుల, కుమారుడు వంశీరామ్ ఉన్నారు. మోహన్ ఆర్కిటెక్ట్స్ & అసోసియేట్స్ వ్యవస్థాపకులు బోగొల్లు మోహన్‌రెడ్డి సతీమణి నిర్మలమ్మ జనార్ధనరెడ్డికి ఏకైక చెల్లెలు. జనార్ధనరెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ.. వారి కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# 2న.. నింగిలోకి ఎల్‌వీ-ఎం3-ఎం5



అంతరిక్ష రంగంలో అద్భుతాలు సాధిస్తూ ముందుకు దూసుకుపోతున్న ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) తాజాగా నవంబరు 2న మరో రాకెట్ ప్రయోగానికి సన్నద్ధమైంది. శ్రీహరికోటలోని షార్‌లో ఉన్న రెండవ ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీ ఎం3-ఎం5 రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్ర వేత్తలు సమాయత్తమయ్యారు. దాదాపు 4400 కిలోల బరువున్న సీఎంఎస్-03 అనే సమాచార ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారా నింగిలోకి పంపనున్నారు. అదే విధంగా సీఎంఎస్-03 మల్టీ బ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇది భారత భూభాగంతో పాటు, సముద్రాల ప్రాంతాల్లోనూ సేవలందిస్తుంది. ఎల్‌వీ ఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని అంతరిక్షంలో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా పూర్తిచేశారు. ఈ రాకెట్‌ని 3 దశల్లో ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. బాహుబలిగా పేరుగాంచిన ఈ శక్తివంతమైన రాకెట్3వేల నుంచి 6వేల కిలోల బరువు కలిగిన ఉపగ్రహాలను కూడా సునాయాసంగా రోదసిలోకి తీసుకువెళ్లగలగడం దీని ప్రత్యేకత. ఈ ప్రయోగంతో ఇస్రో అంతరిక్ష రంగంలో మరో మైలురాయిని అధిగమిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఆరంభ శూరత్వం.. అన్నింటా అలసత్వం!

(మొదటిపేజీ తరువాయి)

పైగా ప్రభుత్వంపై గతంలో కంటే తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. దీంతో తెలుగుదేశం, జనసేన అధినేతలు ఆ పార్టీల నాయకుల ఆరోపణల్లో వాస్తవికత ఎంతన్నది ప్రశ్నార్థకంగా మారుతోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

## మద్యం కేసులో తూతూమంత్రంగా!

మద్యం అమ్మకాల్లో డిజిటల్ విక్రయాలు లేకుండా అక్రమాలకు పాల్పడడం, డిస్టలరీస్‌లను ఇష్టారాజ్యంగా వాడుకుని తమ నేతల కంపెనీల్లో తయారయ్యే నాసిరకం మద్యాన్ని ప్రజలకు అంటగట్టారనే ఆరోపణలు వైఎస్సార్‌సీపీ నేతలపై ఉన్నాయి. అలాగే కమీషన్ కోసం తమ బ్రాండ్‌లనే విక్రయించి సొమ్ము చేసుకున్నారనే విమర్శలకు కూడా కొదవ లేదు. మరి ఇంతటి ప్రాధాన్యత ఉన్న కేసులో ఇప్పటికే పదుల సంఖ్యలో నేతలు అరెస్టయినా వారి పాత్ర ఎంత..? అసలు ప్రధాన పాత్రదారులు ఎవరు..? మొత్తం వ్యవహారానికి సూత్రధారులు ఎవరు..? అనే విషయాలని సిట్ బృందాలు స్పష్టంగా తేల్చడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో అరెస్టయిన వారంతా బెయిళ్లపై విడుదలవుతూ దర్జాగా తిరుగుతున్నారనే విమర్శలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దీనికి నిదర్శనం ఈ కేసులో అరెస్టయ్యి బెయిల్‌పై వచ్చిన మిథున్‌రెడ్డికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాలాభిషేకాలు చేసి మరీ సంబరాలు చేసుకోవడం. ఇంతకుమించి తమ నేతను ఏం చేస్తారంటూ వారు ప్రశ్నిస్తుండడం ఇటు దర్యాప్తు లోపాలను, అటు కూటమి నేతల అసమర్థతను ఎత్తిచూపుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇసుక, అటవీ భూముల ఆక్రమణల్లో పురోగతి శూన్యం!

ఇక ఎంపీ మిథున్‌రెడ్డి తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విషయానికి వస్తే, గతంలో పంచాయతీరాజ్ శాఖమంత్రిగా, అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి, వైఎస్సార్‌సీపీలో నంబర్-2గా ఆయన చక్రం తిప్పారు. ఒకానొక సమయంలో తన సొంత నియోజకవర్గం కుప్పంలోనే చంద్రబాబు తిరగకుండా తన అనుచరులతో పెద్దిరెడ్డి అడ్డుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక అక్రమ రవాణా, కుప్పం మైనింగ్ లీజుల్లో అక్రమాలకు పాల్పడడం, పుంగనూరు, కల్లూరు మండలాల్లో రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కోవడం, అటవీ భూములను అక్రమంగా ఆక్రమించడం, మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్లను దగ్ధం చేయడం, తిరుపతి బుగ్గమఠంలో అనధికార నిర్మాణాలు చేపట్టడం వంటి కేసులు పెద్దిరెడ్డిపై నమోదయ్యాయి. అయితే రెండేళ్లు కావొస్తున్నా వాటి దర్యాప్తులో వీసమెత్తు పురోగతి కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదేమో! అంతే కాకుండా తన కుమారుడు మిథున్‌రెడ్డి బెయిలుపై విడులైన తర్వాత పెద్దిరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తామంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

## భూమన, పేర్నినాని, అంబటిపై కేసులు ఏమయ్యాయో?

ఇక కల్తీనెయ్యి వినియోగించి దేవదేవుడైన శ్రీవారి లడ్డూ తయారీలోనే అక్రమాలకు పాల్పడ్డారని, కొండపై విచ్చలవిడిగా దర్శన టికెట్లు అమ్ముకున్నారని, గోశాలలో పశువుల మరణాలపై తప్పుడు ఆరోపణలు చేశారని, అలిపిరి వద్ద విష్ణువు విగ్రహాన్ని టీటీడీ అధికారులు గాలికొదిలేశారని విమర్శలు చేసిన కేసుల్లో ప్రధాన నిందితుడుగా మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డిపై పదుల సంఖ్యలో కేసులున్నాయి. అయినా వాటి దర్యాప్తులో భాగంగా కరుణాకరరెడ్డిని పిలిపించడం కానీ, అరెస్టు చేయడం కానీ చేయడం లేదనే విమర్శలు కూటమిపై వస్తున్నాయి. అలాగే ప్రతి విషయానికి స్పందించే పేర్ని నానిపై రేషన్ బియ్యం అక్రమ రావాణా కేసులు, పోలీసులను స్టేషన్‌లోనే బెదిరించారనే కేసులు ఉన్నాయి. అయినా ఆయనకు కనీసం నోటీసులు కూడా ఇవ్వడం లేదని తెలుగుదేశం నాయకులే వాపోతున్నారు. ఇక మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పోలవరం ప్రాజెక్టులో అక్రమాలకు పాల్పడడం, గంట అరగంట అంటూ మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం, జగన్ పల్నాడు పర్యటనలో నిబంధనలను ఉల్లంఘించి పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడడం వంటి కేసులున్నా వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఇక గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబును పలుమార్లు వ్యక్తిగతంగా దూషించిన గుడివాడ మాజీఎమ్మెల్యే కొడాలి నానిపై కనీస చర్యలు చేపట్టడం లేదని కూటమి నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. రేవ్ పార్టీలు, పేకాట స్థావరాలు నాని హయాంలో లెక్కకుమిక్కిలి ఉండేవని, కానీ ఆయనపై కేసులు మాత్రం నమోదు కావడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ వాగుడు కాయిగా గుర్తింపు పొందిన మాజీమంత్రి రోజాపై ఆడుదాం ఆంధ్రా, నగరిలో భూ అక్రమాలు వంటి కేసులున్నా కూటమి పెద్దలు మీనమేషాలు లెక్కిస్తున్నారు అంటూ టీడీపీ స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ములకల చెరువు కల్తీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్‌పై తీవ్ర ఆరోపణలు చేసినా కూటమి ప్రభుత్వం నుంచి సరైన స్పందన కనిపించకపోవడం, ఆయన్ని అరెస్టు చేయకపోవడంపై జనాల్లో పెద్దఎత్తున అనుమానాలకు తావిస్తోంది.

## అధికారుల్లోనూ అదే భయం?

ఇప్పటికే ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రులు సైతం పలు అంశాలపై కనీసం స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. మళ్లీ జగన్ ప్రభుత్వం వస్తే తమ పరిస్థితి ఏమవుతుందో? అనే భయం వారిలో కనిపిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. దీంతో చాలామంది ప్రతిపక్షానికి ధీటుగా సమాధానం చెప్పడం లేదనేది బహిరంగా రహస్యమే. చివరికి ఎమ్మెల్యేలు సైతం ప్రతిపక్షం ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టడం లేదంటూ సాక్షాత్తూ చంద్రబాబే ఆగ్రహం వ్యక్తం చేయడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఇక ప్రభుత్వంలో ఉన్నామన్న మాటే కానీ వైఎస్సార్‌సీపీ ఆరోపణలకు, విమర్శలకు జనసేన, బీజేపీ ఎమ్మెల్యేల నుంచి కనీస ప్రతిఘటన కనిపించడం లేదు అన్నది నిర్వివాదాంశమే. అప్పుడప్పుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రం జగన్ బెదిరింపులకు సమాధానం చెబుతున్నారన్నది విశ్లేషకుల మాట. మరి కూటమి నేతల పరిస్థితే ఇలా ఉంటే, తమకెందుకొచ్చిన తంటా అనే రీతిలో అధికారులు కూడా చూసీ చూడనట్లు ఉండిపోతున్నారని, అందుకే రెడ్‌బుక్ పేరుతో తొలుత వైఎస్సార్‌సీపీ నేతలపై పెద్దఎత్తున కేసులు నమోదైనా వాటి దర్యాప్తులో మాత్రం అడుగు ముందుకు పడడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఇదే అదునుగా అరెస్టయ్యి బెయిల్‌పై విడుదలైన మిథున్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి వంటి నేతలు సైతం కూటమి ప్రభుత్వ పెద్దలపై అంతెత్తున లేస్తూ రెచ్చిపోతున్నారన్నది తటస్థుల అభిప్రాయం. మరి ఇప్పటికైనా కూటమి నేతలు, అధికారులు కేసుల్లో పురోగతి తెచ్చి తాము గతంలో చేసిన ఆరోపణలను నిజం చేస్తారో..? లేక తమది ఆరంభ శూరత్వమే అంటూ పజల్లో పలుచనవుతారో, కాలమే నిర్ణయించనుంది..!

# మంత్రి నారాయణ చొరవతో..
# సహాయక చర్యలు



మొంథా తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు జిల్లాను అతలాకుతలం చేస్తున్న విపత్కర పరిస్థితుల్లో మంత్రి నారాయణ ప్రజలను ఆదుకునేందుకు ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులకు, అధికారులకు తగు సూచనలు చేశారు. నెల్లూరు నగర శివారు ప్రాంతాల్లో గుడిసెల్లో నివాసం ఉంటూ వానల ధాటికి ఇబ్బందులు పడుతున్న వారికి మంత్రి సొంత నిధులతో టార్పాలిన్ పట్టలను తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను పురమాయించి పంపిణీ చేయించారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి ఉదయం టిఫిన్ మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఏర్పాట్లపై అధికారులతో, పార్టీ వర్గాలతో సమీక్షించి ఎప్పటికప్పుడు తగు సాయం అందజేశారు. తుఫాన్ లాంటి పరిస్థితుల్లో ప్రజలను అన్నివిధాల ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందంటూ మంత్రి నారాయణ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు, టీడీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి వానలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సహాయకచర్యలు చేపట్టారు. ఇబ్బందుల్లో ఉన్నవారికి భరోసా కల్పించారు. వారు చేసిన సేవలు అభినందనీయమంటూ మంత్రి నారాయణ ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా తుఫాన్ ప్రభావం వల్ల కలిగిన నష్టాలను తెలుసుకుంటూ, అధికారులను అప్రమత్తం చేస్తూ అమరావతి నుంచి టెలికాన్ఫరెన్స్ ల ద్వారా ఆయన నెల్లూరులోని అధికారులకు సూచనలు చేస్తూ, పార్టీ శ్రేణులను రంగంలోకి దింపి క్షేత్రస్థాయిలో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు చేసిన కృషి అందరి ప్రశంసలకు పాత్రమైంది.

# బాధితులకు ప్రశాంతమ్మ భరోసా



కష్టకాలంలో ప్రజలకు అండగా వుండాలన్న లక్ష్యంతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తమ నియోజకవర్గ పరిధిలోని వరద ప్రభావిత గ్రామాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామంటూ భరోసా ఇచ్చారు. ఈనెల 29న ఆమె విడవలూరు మండలం గాదెలదిన్నె గ్రామానికి వెళ్లి గ్రామస్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలో మెరుగైన డ్రైనేజ్ వసతులు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీవర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధికారులతో కలిసి పలు గ్రామాలలో పర్యటించారు. బాధితులకు సహాయక చర్యలు చేపట్టిన నాయకులు, కార్యకర్తలను ఆమె ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. ఆమెతో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కోవూరు నియోజకవర్గం మరియు నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అనారోగ్య పీడితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇటీవల లబ్ధిదారులకు అందజేశారు. నెల్లూరులోని తమ నివాసంలో వాటిని పంపిణీ చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని 86 మందికి కోటీ 10లక్షల విలువైన చెక్కులు అందించారు. నెల్లూరు పార్లమెంట్ పరిధికి చెందిన మరో నలుగురికి రూ. 14 లక్షల 33 వేల చెక్కులు అందచేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 17 నెలల వ్యవధిలో కోవూరు నియోజకవర్గంలో 473 మంది అనారోగ్య పీడితులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా 5 కోట్ల 53 లక్షల ఆర్థిక సహాయం అందచేసినట్టు తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ద్వారా 44 మందికి 1 కోటి 10 లక్షల సిఎంఆర్ఎఫ్ అందించామని వివరించారు.

# రాష్ట్ర పండుగగా..సీపీ బ్రౌన్ జయంతి



తెలుగుభాషకి, తెలుగు సారస్వతానికి అనితర సాధ్యమైన సేవలందించిన మహనీయుడు సీపీ బ్రౌన్ (చార్లెస్ ఫిలిప్ బ్రౌన్) జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, నవంబరు 10న ఆయన జయంతిని ఘనంగా నిర్వహించనుంది. ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో తెలుగుభాషాభిమానుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# గురువు పేరు నిలబెడుతున్న.. మన వెంకయ్య!

**గురువంటే గౌరవం తగ్గిపోతున్న నేటి రోజుల్లో, తమకు పుస్తక పాఠాలతో పాటు జీవితపాఠాలు కూడా బోధించిన గురువు పేరును శాశ్వతంగా నిలుపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు పూర్వ ఉప రాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు. కన్నతల్లినీ-జన్మభూమిని, చదువు చెప్పిన గురువులను విస్మరించకూడదంటూ ఆయన తన ఉపన్యాసాల్లో తరచూ చెప్తూనే ఉంటారు. అలా చెప్పడమే కాకుండా ఆ మాటల్ని నేటికీ అక్షరాలా ఆచరిస్తూ ఆయన అందరికీ స్ఫూర్తిదాయకమవుతున్నారు.**

తాను నెల్లూరు విఆర్ కళాశాలలో చదువుకునే రోజుల్లో తనకు మార్గదర్శనం చేసిన గురువు, దివంగత పోలూరి హనుమజ్జానకీరామశర్మ పేరుతో ధర్మ నిధిని ఏర్పాటుచేసి ఏటా ఒక సారస్వత ప్రముఖునికి పురస్కారం అందజేస్తున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదరు కార్యక్రమంలో భాగంగా, ఈ ఏడాది పోలూరి వారి పురస్కారాన్ని ప్రఖ్యాత ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకి అందజేయడం విశేషం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈ పురస్కార ప్రదానోత్సవంలో భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి, నెల్లూరీయులైన మన ముప్పవరపు వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడిపించే శక్తి గురువులకే ఉందన్నారు. నేటి యువత పాశ్చాత్య ధోరణుల వ్యామోహంలో పడిపోతున్నారని, వారికి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతని, మాతృభాష గొప్పతనాన్ని తెలియజేసి వారిని మంచి దారిలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతటి బృహత్తరమైన బాధ్యతను నిర్వర్తించగలిగేది గురువులేనని అన్నారు.

## • చాగంటివారికి 'పోలూరి' అవార్డు



### సాక్షాత్తూ.. సరస్వతీ స్వరూపులు 'పోలూరి' వారు:

పోలూరి హనుమజ్జానకీ రామశర్మ గారు సాక్షాత్తూ సరస్వతీ స్వరూపులని, బ్రాహ్మీమయమూర్తి అని, పదాలతో విష్ణు పదార్చన చేసేవారని, సాహిత్యంతో పరమేశ్వరుని అభిషేకించేవారని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు తమ గురువును గుర్తుచేసుకున్నారు. జీవితాంతం సనాతన ధర్మ పరిరక్షణ కోసం తమ గురువు శ్రమించారని, వారి పాండిత్యం, బోధనా పటిమ, జ్ఞాపకశక్తి అద్వితీయమని అన్నారు. తాను రాజకీయ జీవితంలో ధారాళంగా ధాటిగా మాట్లాడగలిగే నేర్పు ఆ గురువు గారి ప్రేరణతోనే వచ్చిందని ఆయన వినమ్రంగా చెప్పారు. తాను నెల్లూరులో డిగ్రీ చదవుకునే రోజుల్లో తెలుగుభాష పట్ల, సాహిత్యం పట్ల మక్కువ పెరిగేలా చేసింది పోలూరివారేనన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో యువతకు మాతృభాష దూరమవుతోందని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం-ప్రజలు కలసికట్టుగా అమ్మభాష అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఎవరు ఏ స్థాయికి వచ్చినా మాతృమూర్తి, మాతృదేశం, మాతృభాష, జన్మభూమి, గురువు ఈ అయిదింటినీ మరచిపోకూడదన్నారు. తనకు విద్య నేర్పిన గురువు, ప్రాతఃస్మరణీయులైన పోలూరి హనుమజ్జానకీరామశర్మ నెల్లూరుకు చెందిన సారస్వత మణిదీపాల్లో ఒకరని అన్నారు. వారి పేరుతో ఇచ్చే పురస్కారాన్ని సనాతన భారతీయ వాఙ్మయాన్ని అధ్యయనం చేసి, వాటిని సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్న చాగంటి వారికి అందించడం సముచితం అంటూ, చాగంటి వారికి ఆ పురస్కారాన్ని అందజేశారు. తొలుత, పోలూరి వారి స్మృతికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాంతా-వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' డా. కేఐ వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, తెలంగాణ ప్రభుత్వ పూర్వసలహాదారు డా.కేవీ రమణాచారి, ప్రముఖ సాహితీవేత్త డా. రేవూరి అనంత పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రముఖ శివాలయాలకు..

## ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ శివాలయాలను దర్శించుకునేందుకు నెల్లూరు-1వ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అరుణాచలం దర్శించుకునేందుకు అక్టోబరు 25, 26 తేదీల్లోనూ, నవంబరు 1,2,4,7,8,9, 15,16 తేదీల్లో ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి రాత్రి 9.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఛార్జీ రూ. 1200గా నిర్ణయించినట్లు చెప్పారు. అదేవిధంగా, పంచారామ క్షేత్రాలైన అమరావతి, సోమేశ్వరాలయం, క్షీరారామం, భీమేశ్వరాలయం, సామర్లకోట ప్రాంతాలకు అక్టోబరు 25, 26 తేదీల్లోను, నవంబరు 1,2,4,7,8,9,15,16 తేదీల్లోనూ బస్సులు రాత్రి 8.30 గంటలకు నెల్లూరు నుంచి బయలుదేరుతాయని తెలిపారు. శ్రీశైలం దర్శించుకునేందుకు అక్టోబరు 22 నుంచి నవంబరు 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, అవి ఆ తేదీల్లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి వెళ్తాయని, ఈ సూపర్‌లగ్జరీ బస్సులో ఛార్జి 670 రూపాయలని తెలిపారు. భక్తులు ముందస్తు రిజర్వేషన్‌కు 99592 25641 లేదా 0861-2323333 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని ఆయన కోరారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# బాధితులను ఆదుకుంటాం



మొంథా తుఫాను బాధితులను ఆదుకునేందుకు కూటమి నేతలు సిద్ధంగా ఉన్నట్లు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నెల 28వ తేదీ వాకాడు బ్యారేజీ, బాలిరెడ్డి పాలెం వంతెన, తూపిలిపాళెం, ఎస్టీ కాలనీలోని ముంపు బాధితులకు పండ్లు, రొట్టెలు, తాగునీరు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో రోడ్లు పాడవడంతో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ ఇక్బాల్, ఎంపిడివో సాయిప్రసాద్, కూటమి నాయకులు విజయశేఖర్‌రెడ్డి, మధురెడ్డి, కృష్ణమూర్తి, పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

# వినియోగదారులకు విశ్వసనీయ సేవలు



గూడూరు, చిల్లకూరు బైపాస్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ స్టీల్స్ & సిమెంట్ దుకాణాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. మంచి నాణ్యత గల ఇనుము, సిమెంట్‌ను హోల్‌సేల్ ధరలకే రిటైల్‌గా వినియోగదారులకు అందజేసేలా ఈ దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దుకాణం అధినేత గోను సంధ్యారాణి మాట్లాడుతూ వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు. తమ దుకాణంలో అన్ని రకాల స్టీల్, సిమెంటు బ్రాండ్లు సరసమైన ధరలకే అందజేస్తామన్నారు. గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, పెంచలకోన ఆలయ మాజీఛైర్మెన్ తానంకి నానాజీ, కొండేపాటి కోమలి, జశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి రెయిన్ కోట్లు



వర్షాలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు వీలుగా గూడూరు డీఎస్పీ పి.గీతా కుమారి గూడూరు సబ్‌డివిజన్ ఆఫీసులో మరియు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి ఈ నెల 27వ తేదీన రెయిన్ కోట్లు పంపిణీ చేశారు.

# వన్‌టౌన్‌లో 'ఓపెన్ హౌస్'



పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా ఇటీవల గూడూరు 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్' కార్యక్రమం నిర్వహించారు. జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల బాలికలకు పోలీస్‌శాఖ యొక్క విధుల గురించి అవగాహన కల్పించారు. స్టేషన్‌లోని రిసెప్షన్ డెస్క్, మహిళల సహాయ కేంద్రం, వైర్‌లెస్ సెట్, లాక్-అప్, స్టేషన్ రికార్డులు, డయల్100 ట్యాబ్స్ వంటి విభాగాల గురించి వారికి తెలియజేశారు. పట్టణ సీఐ శేఖర్‌బాబు, 1వపట్టణ ఎస్.ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

# కర్నూలు వద్ద బస్సు దుర్ఘటన ఘోరం

కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం ఘోరమని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మయూరి శ్యాంయాదవ్ ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు.



# పోటుపాలెం గిరిజనులకు సాయం

భారీ వర్షాల నేపథ్యంలో గూడూరు మండలం, పోటుపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీ, శారదనగర్ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి అక్కడివారికి భోజన ప్యాకెట్లు, రెయిన్‌కోట్‌లు, గొడుగులను అందచేశారు. ప్రజలు అధైర్యపడవద్దని, గ్రామ స్థాయి అధికారులు ఉంటారని, ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తారని తెలిపారు. గూడూరు తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఏ.ఈ.సురేష్, డాక్టర్ కోట సునీల్‌కుమార్, రూరల్ ఎస్.ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

## విందూరు పునరావాసం పరిశీలన

మొంథా తుఫాన్ నేపథ్యంలో గూడూరు మండలం, విందూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని గూడూరు డి.ఎల్.డి.వో వాణి రెడ్డి, ఎంపిడిఓ మధుసూదన్‌రావులు పరిశీలించారు. బాధితులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందివ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం, పంబలేరు వాగును పరిశీలించారు.

# కాలేషా మృతి బాధాకరం



గూడూరు సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా మృతి బాధాకరమని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. ఆయన తుదిశ్వాస వరకు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశారని, గూడూరులో పేదల నివేశ స్థలాల కోసం పోరాటం చేశారని అన్నారు. అనంతరం ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరామిరెడ్డి, పుట్టా శంకరయ్య, మణి, అడపాలప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, వెంకటరావు, జిలానీ భాషా, బి.వి రమణయ్యలు ఆయనకి నివాళులు అర్పించారు.



## రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్‌లో..
# వింజమూరు విద్యార్థి ప్రతిభ

ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలలో నెల్లూరుజిల్లా వింజమూరు జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి గోసాల ఏసురత్న జోసఫ్ తృతీయ స్థానంలో నిలిచాడు. ఇన్‌స్ట్రుమెంటల్ పర్కషన్(తబలా) విభాగంలో ఆ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభతో రాణించి, యస్.ఇ.ఆర్.టి డైరెక్టర్ యమ్.వి.కృష్ణారెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్, మెమెంటో, మెడల్ అందుకున్నాడు. విజేతగా నిలిచిన జోసఫ్‌ను, సహకరించిన ఉపాధ్యాయులు కె.విజయచంద్ర, సి. హెచ్ మహేంద్ర, సి. హెచ్. భావన్నారాయణలను, ఆ పాఠశాల ప్రధానోపాధ్యా యులు సి. హెచ్ మాలకొండయ్య అభినందించారు.

# ‘మొంథా’.. కుండపోత

మొంథా తుఫాన్ ప్రభావంతో ఈనెల 28వ తేదీన జిల్లా వ్యాప్తంగా భారీవానలు కురిశాయి. చెరువులు దొరువులు వాగులు వంకలన్నీ నిండిపోయాయి. 101.2 మిల్లీ మీటర్ల కుండపోత వానతో నెల్లూరు నగరంలో జనజీవనం స్తంభించిపోయింది. మంగళవారం ఒక్కరోజులోనే జిల్లాలో సగటున 105.1 మిల్లీ మీటర్ల వాన కురిసింది. కావలిలో 174.6 మి.మీ, అల్లూరులో 156.6, దగదర్తిలో 149.2, జలదంకిలో 145.8, విడవలూరులో 140.8, కొడవలూరులో 139.4, బోగోలులో 134.6, ఉలవపాడులో 123.6, వలేటివారిపాళెంలో 120.4, గుడ్లూరులో 120.0, తోటపల్లిగూడూరులో 116.2, కలిగిరిలో 113.4, కోవూరులో 108.6, బుచ్చిరెడ్డిపాళెంలో 107.0చ లింగసముద్రంలో 105.4, పొదలకూరులో 104.2, నెల్లూరులో 101.2, నెల్లూరు రూరల్‌లో 91.6, వింజమూరులో 100.6, ఉదయగిరిలో 100.4, కొండాపురంలో 99.8, సంగంలో 99.6, అనుమసముద్రంపేటలో 98.2, ఇందుకూరుపేటలో 98.2, చేజర్లలో 93.4, మర్రిపాడులో 93.4, వరికుంటపాడులో 84.8, వెంకటాచలంలో 83.2, ఆత్మకూరులో 79.2, కలువాయిలో 76.2, ముత్తుకూరులో 75.8, అనంతసాగరంలో 72.4, దుత్తలూరులో 71.0, సీతారామపురంలో 69.8, సైదాపురంలో 69.4, మనుబోలులో 65.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# సమాజ సంస్కరణకై తపించిన జాషువా



మహాకవి గుర్రం జాషువా సమాజ సంస్కరణే ధ్యేయంగా కవిత్వం రచించారని ప్రముఖ సాహిత్యోపన్యాసకులు, నెల్లూరుకు చెందిన కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి అన్నారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఈనెల 26న 166వ ప్రసంగ కార్యక్రమం జరిగింది. చెన్నై టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్ కృష్ణా హాల్ వేదికగా జరిగిన ఈ సభలో బొగ్గరపు పాల్గొని ‘విశ్వనరుడు గుర్రం జాషువా’ అనే అంశంపై ప్రసంగించారు. పీడితవర్గాల ఆవేదనను కవిత్వంలో ఆవిష్కరించిన మహాకవి జాషువా అని, తనకు కులమత భేదాలు లేవని..తాను విశ్వనరుడినని జాషువా ప్రకటించుకున్నారని ఆయన కొనియాడారు. జాషువా రచించిన ‘గబ్బిలం’ వంటి కావ్యాల్లోని మానవీయ దృక్పథాన్ని బొగ్గరపు వివరంగా తెలియజేశారు. అనంతరం, వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకేరెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుర్రం జాషువా మనుమడు నాగూర్ కూడా బొగ్గరపును అభినందించి సత్కరించారు.

# పాకిస్థాన్ కొత్త ఎత్తుగడలు




అంతర్జాతీయ రాజకీయాల్లో స్థిరమైన శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం మరోసారి రుజువవుతోంది. గత కొంతకాలంగా పాకిస్థాన్ అనుసరిస్తున్న బహుముఖ వ్యూహాలు భారతదేశ విదేశాంగ, రక్షణ విధానాలపై సమీక్ష జరుపుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ఒకవైపు చైనా, టర్కీ వంటి సంప్రదాయ భారత వ్యతిరేక కూటములకు బలమిస్తూనే, మరోవైపు వ్యూహాత్మకంగా అమెరికాతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని పాక్ చూస్తోంది. ఈ ద్వంద్వ విధానం దక్షిణాసియా భౌగోళిక రాజకీయ సమతుల్యతను ప్రభావితంచేసే అవకాశం ఉంది.

### బంగ్లాదేశ్ వేదికగా ఐఎస్ఐ కుట్రలు

పాకిస్థాన్ ప్రాంతీయంగా తన సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో వ్యూహాత్మక చొరవ చూపుతోంది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా స్థానంలో వచ్చిన తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్ వైపు మొగ్గుచూపుతోంది. పాక్‌తో బంధాన్ని బలోపేతం చేసుకుంటూ, ఆ దేశం నుంచి ఆయుధాలు, ఆహార ధాన్యాలను దిగుమతి చేయడం ప్రారంభించింది. ఈ కొత్త మైత్రికి నిదర్శనంగా, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, బంగ్లా నేత యూనస్ మధ్య ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయి. సైనిక సహకారాన్ని కూడా పెంపొందించుకుంటూ, ఇరు దేశాల సైనికాధికారుల పర్యటనలకు అంగీకారం తెలిపారు.

చారిత్రక విభేదాలు ఉన్నప్పటికీ, బంగ్లాదేశ్‌తో రక్షణ సహకారాన్ని మరింత పెంచుకోవాలని పాకిస్తాన్ నిర్ణయించుకుంది. ఈ సహకారం కేవలం సైనిక విన్యాసాలకే పరిమితం కావడం లేదు. అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, తాజా నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఢాకాలోని పాక్ దౌత్య కార్యాలయంలో ఐఎస్ఐ ప్రత్యేక సెల్ ఏర్పాటుకు బంగ్లాదేశ్ అనుమతించింది. బ్రిగేడియర్ స్థాయి అధికారి నేతృత్వంలో పనిచేసే ఈ సెల్ యొక్క ఏకైక లక్ష్యం భారత్‌పై నిఘా పెట్టడం, బంగ్లాదేశ్ గడ్డపై భారత వ్యతిరేక శక్తులకు శిక్షణ ఇవ్వడం.

రక్షణ ఒప్పందాల ముసుగులో జరుగుతున్న ఈ గూఢచర్య పన్నాగాలు బంగ్లాదేశ్‌ను భారత వ్యతిరేక కార్యకలాపాలకు వేదికగా మారుస్తున్నాయి. ఈ పరిణామం భారతదేశ తూర్పు సరిహద్దులో తీవ్రమైన భద్రతాపరమైన సవాలును విసురుతోంది. దీనికి తోడు, పాక్ సౌదీ అరేబియా వంటి కీలక ఇస్లామిక్ దేశంతో రక్షణ ఒప్పందాలను పటిష్టం చేసుకోవడం.. ఇవన్నీ ప్రాంతీయంగా భారతదేశాన్ని ఒంటరిని చేయాలనే పాక్ వ్యూహాత్మక ప్రయత్నం కావచ్చు.

### అమెరికాతో భాగస్వామ్యంపై ఆందోళన

ఒకవైపు భారత వ్యతిరేకవర్గాలతో సంబంధాలను బలోపేతం చేసుకునే ప్రయత్నంతోపాటు, మరోవైపు అమెరికాతో తన బంధాన్ని పునరుద్ధరించుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉగ్రవాద లక్ష్యాలపై దాడుల కోసం పాకిస్థాన్ గగనతలాన్ని అమెరికా డ్రోన్లకు రహస్యంగా అనుమతినిచ్చిందనే వార్తలు ఈ కొత్త సమీకరణానికి నిదర్శనం. ఉగ్రవాదాన్ని అణచివేసే నెపంతో పాక్ తిరిగి అమెరికాకు దగ్గరవడం, ప్రధానంగా ఆర్థిక, సైనిక సహాయాన్ని పొందాలనే వ్యూహంలో భాగమే.

భారత్‌ను నియంత్రించడంలో పాక్ యొక్క సామర్థ్యాన్ని అమెరికా ఇప్పటికీ ఒక వ్యూహాత్మక అంశంగా పరిగణించవచ్చనే భారత వర్గాలు భావిస్తున్నాయి. క్వాడ్ (QUAD) వంటి కూటముల్లో భారత్‌తో భాగస్వామ్యం ఉన్నప్పటికీ, అమెరికా పాక్‌కు సైనికపరమైన మద్దతు ఇవ్వడం భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలోని వైరుధ్యాలను బహిర్గతం చేస్తోంది. భారతదేశం తన విదేశాంగ విధానాన్ని కేవలం దిల్లీ కేంద్రంగా కాకుండా, పొరుగు దేశాలలో మరింత చురుకుగా మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

### పొరుగు దేశాల విధానంపై పునఃసమీక్ష

పొరుగు దేశాలతో కేవలం ఆర్థికంగానే కాక, రక్షణ, సాంకేతిక రంగాలలో బంధాలను లోతుగా పెంచాలి. సౌకర్యవంతమైన రుణాలు ఇస్తూ ప్రాజెక్టుల పూర్తి ద్వారా బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలకు భారతదేశమే మెరుగైన, స్థిరమైన భాగస్వామి అనే నమ్మకాన్ని బలోపేతం చేయాలి. బంగ్లాలో ఐఎస్ఐ కార్యకలాపాలను అంతర్జాతీయంగా తీవ్రంగా ఖండించాలి.

### అమెరికా-పాక్ సంబంధాలపై స్పష్టత

పాకిస్థాన్ యొక్క ద్వంద్వ వైఖరిపై వాషింగ్టన్‌కు స్పష్టమైన సందేశం పంపాలి. పాక్–అమెరికా రక్షణ సహకారం భారతదేశ భద్రతకు ఏ విధంగానూ విఘాతం కలిగించరాదనే కఠిన వైఖరిని ప్రదర్శించాలి.

### పశ్చిమాసియా దౌత్యం

సౌదీ అరేబియా, యూఏఈ వంటి మిత్రులతో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడం ద్వారా, ఇస్లామిక్ సహకార సంస్థ(OIC)లో పాక్ అనుసరించే కాశ్మీర్ ఎజెండాకు లభించే మద్దతును తగ్గించాలి. భారతదేశం కేవలం రక్షణ దృక్పథంతో కాకుండా, బలమైన దౌత్యపరమైన చొరవతో ముందుకు సాగాలి. ఈ కొత్త సమీకరణాలను అర్థం చేసుకోకుండా, పాత విధానాలతోనే ముందుకెళ్తే, భవిష్యత్తులో వ్యూహాత్మక ఒంటరితనాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అందుకే, ఇప్పుడు భారతదేశం తన విదేశాంగ వ్యవహారాలపై తక్షణ సమీక్ష జరిపి, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలి.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## సమస్యలు తీర్చాలంటూ..
## రోడ్డెక్కిన పీహెచ్‌సీ వైద్యులు

తమ సమస్యలు తీర్చాలంటూ పీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులు ఇటీవల రోడ్డెక్కి ధర్నాందోళన చేశారు. కొందరు వైద్యులు పిల్లలతోసహా ఈ ధర్నాలో పాల్గొన్నారు. నెల్లూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద జరిగిన ఈ ఆందోళనలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ, పీహెచ్‌సీలలో గత ఇరవై ఏళ్ళుగా పనిచేస్తున్నా నేటికీ ఉద్యోగోన్నతి లేదని వాపోయారు. తక్షణమే వైద్యులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. అదేవిధంగా వైద్యులకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, జీఓ నం.90ని వెంటనే ఉపసంహరించుకోవాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు 50శాతం మూలవేతనం ఇచ్చేవిధంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఏళ్ళ తరబడిగా ఉన్న ఈ సమస్యలను ప్రభుత్వం పరిశీలించకపోవడం దారుణమని, ఇకనైనా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ఈ ఆందోళనలో వైద్యులు బ్రహ్మేశ్వరనాయుడు, నవీన్‌కుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రావణి, జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్యాలయం వద్ద..
## నిరాహార దీక్ష

తమకు న్యాయం చేయాలంటూ కావలి విద్యుత్ కార్యాలయం వద్ద కావలికి చెందిన ఏపీ ట్రాన్స్‌కో కాంట్రాక్టర్ రామిరెడ్డి ఇటీవల నిరాహార దీక్ష చేశారు. ఆయనకు పలువురు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లేబర్ ఎలక్ట్రికల్ బిల్లులకు ఎల్‌ఓసీ వేయకపోవడం అన్యాయమంటూ ఈ నిరాహారదీక్షను చేపట్టానన్నారు. గత కొన్నేళ్ళుగా తాను ట్రాన్స్‌కో కాంట్రాక్టర్‌గా ఉంటూ, కావలి డివిజన్‌లో ఎప్పుడు విపత్తులు సంభవించి ఎక్కడ విద్యుత్ స్తంభాలు విరిగిపోయినా, పడిపోయినా వాటిని తిరిగి నిలబెడుతున్నామన్నారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులు డివిజన్ కార్యాలయానికి వస్తే వాటికి ఎల్‌ఓసీ వేయకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమలాంటి చిన్న కాంట్రాక్టర్లు తక్కువ ధరలకే పనులు చేస్తామన్నా, తమకు పనులివ్వడం లేదన్నారు. చిన్నచిన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే, తక్కువ రేటుకే చేయడం జరుగుతుంది కనుక రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు తమ సమస్యను పరిశీలించి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు తమ సమస్యను పట్టించుకోకపోతే అమరావతిలో అసెంబ్లీ ఎదుట నిరాహార దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

## ఆ ఏటీఎస్ వద్దంటూ.. ధర్నా

వాహనదారులకు నష్టం కలిగిస్తున్న ఏటీఎస్ (ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్)ని రద్దు చేయాలని కోరుతూ, నెల్లూరులో ఈనెల 27న ఆటో కార్మికులు డిమాండ్ చేస్తూ ధర్నాందోళన చేపట్టారు. నగరంలోని సీఐటియు కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటియు నాయకులు టీవీవీ ప్రసాద్, నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సెంటర్‌ని ముత్తుకూరు మండలం కప్పల దొరువు వద్ద ఏర్పాటుచేయడం వల్ల ఫిట్నెస్ సర్టిఫికెట్లు కావలసినవారు, డ్రైవింగ్ లైసెన్సులు అవసరమైనవారు ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. అందులోనూ దీనిని ప్రైవేట్ సంస్థలకి అప్పగించినందువల్ల అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో జిల్లావ్యాప్తంగా ఆర్టీఏ అధికారులే ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేవారని, వారి ద్వారానే ఆ సర్టిఫికెట్లు ఇచ్చేలా చూడాలని వారు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే, ఆర్టీఓ కార్యాలయంలోనే ఎఫ్‌సి విధానాన్ని కొనసాగించాలని కోరుతూ, నవంబరు 7న పెద్దఎత్తున ధర్నా నిర్వహించనున్నామని కూడా వారు తెలిపారు. సిఐటీయు రూరల్ నాయకుడు సుధాకర్, ఆటోకార్మిక సంఘం అధ్యక్షుడు సురేష్, నాయకులు బాబూరావు, రవీంద్ర, పెంచలయ్య, శ్యామ్‌సన్, సురేష్, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి దేవాలయానికి మహర్దశ!

## పునర్‌నిర్మాణానికి శ్రీ చిన్న జీయర్ స్వామీజీ శంకుస్థాపన



**నెల్లూరు మూలాపేటలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయానికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయి. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంకల్పం, శ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆశీస్సులతో భక్తుల ఆకాంక్షలకు తగ్గట్లుగా ఈ దేవస్థానానికి పూర్వవైభవం వచ్చేందుకు కృషి ప్రారంభమైంది.**

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు.. పరమహంస, పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి చేతులమీదుగా ఈనెల 29న ఆలయ పునర్‌నిర్మాణానికి శంకుస్థాపన జరగడంతో.. ఇక ఈ ఆలయానికి మహర్దశ వచ్చినట్లేనని భక్తులు భావిస్తున్నారు. శ్రీ స్వామీజీ ఈ సందర్భంగా ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేసి, శంకుస్థాపన కార్యక్రమాలకి శ్రీకారం చుట్టారు. భక్తుల గోవిందనామస్మరణలతో, వేద మంత్రోచ్ఛరణలతో ఆలయ శంకుస్థాపన మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ హరిజవహర్‌లాల్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు స్వామీజీకి ఘనంగా స్వాగతం పలికారు.

### జాతి వైభవానికి ఆలయాలే మూలాధారాలు :

అనంతరం, చిన్నజీయర్‌స్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేస్తూ, మన జాతి వైభవానికి ఆలయాలే మూలాధారాలన్నారు. పురాతన ఆలయాల ప్రాచీన చరిత్రను కాపాడుకోవడం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. చిత్తశుద్ధి, మంచి సంకల్పం ఉంటే భగవంతుడు మన వెంట ఉంటాడు అనేందుకు, తుఫాన్ వాతావరణంలో కూడా ఈరోజు జరిగిన ఈ గొప్ప కార్యక్రమమే మంచి ఉదాహరణ అన్నారు. భారతదేశం మొత్తం మీద తెలుగువారికి ఉన్న చరిత్ర మరెవ్వరికీ లేదని, తమిళనాడులోని శ్రీరంగం, మధురై తదితర పురాతన ఆలయాల్లో ఇప్పటికీ మన తెలుగు లిపి కనిపిస్తుందని తెలిపారు. మన చరిత్రను మనం సంరక్షించుకోవాలన్నారు. ఆలయాల సుందరీకరణ తప్పు కాదని, అయితే వాటి ప్రాచీనత దెబ్బతినకూడదన్నారు. ఆలయాల చరిత్ర కనుమరుగు కాకుండా ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పురాతన శిలాశాసనాలు, శిలాఫలకాలు, వస్తుసామగ్రిని అలాగే ఉంచి, మన చరిత్రకు సాక్ష్యాలుగా రేపటి తరాలకు అందించాలన్నారు. పూర్వీకులు మనకు అందించిన వేల సంవత్సరాల చరిత్ర పరంపరను కొనసాగిస్తూ ఆలయాలకు వైభవం తీసుకురావాలని సూచించారు. నెల్లూరు శాసనసభ్యులు దివంగత ఆనం వివేకానందరెడ్డి పెద్ద కుమారుడు ఆనం చెంచు సుబ్బారెడ్డి కూడా ఈ ఆలయ పాలక మండలి సభ్యుడిగా చేరడంతో ట్రస్టుబోర్డుకు పరిపూర్ణత చేకూరిందని స్వామీజీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ విశిష్టతపై రూపొందించిన పుస్తకాన్ని చిన్నజీయర్‌స్వామి ఆవిష్కరించారు.

### రాతి కట్టడాలతోనే పునర్ నిర్మాణం

**- మంత్రి ఆనం**

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, 18 నెలల్లో ఆలయ పునర్నిర్మాణం గావించేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు రాష్ట్రప్రభుత్వం రూ. 17కోట్ల నిధులను మంజూరుచేసినట్లు చెప్పారు. ఆలయ పవిత్రత దెబ్బతినకుండా గర్భాలయం, అంతరాలయం, రాజగోపురం తదితర నిర్మాణాలను రాతి కట్టడాలతోనే నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఆలయాల పునర్నిర్మాణాలను రాతి కట్టడాలతోనే నిర్మిస్తామని, అందుకు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నుంచే శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి చెప్పారు. ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత మహా కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను కూడా చిన్నజీయరు స్వామివారి చేతులమీదుగానే నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## కళ్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు గునపాటి రమేష్‌రెడ్డి - ఉషల కుమార్తె
శ్రావ్యరెడ్డి - ప్రషీత్‌రెడ్డి (బిజ్జివేముల రమణారెడ్డి - శ్రీలతల కుమారుడు)ల వివాహం
అక్టోబర్ 26వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# పేరుకే ప్రభుత్వం.. ప్రైవేట్‌దే పెత్తనం!

## ఎఫ్.సిల మంజూరులో డమ్మీగా మారిన రవాణా శాఖ

## గుత్తేదారుదే ఇష్టారాజ్యం

***ప్రభుత్వ రంగంలో కన్నా ప్రైవేట్ రంగంలో సేవలు నాణ్యమైనవిగా, సౌకర్యవంతంగా, మెరుగైనవిగా ఉంటాయన్నది సహజంగా అందరికీ ఉండే అభిప్రాయం. అందుకోసమే కొన్ని ప్రభుత్వ రంగ సేవలని ప్రజల సౌకర్యార్థం వారి సౌలభ్యం కోసం ప్రైవేట్ పరం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వంతో పాటు కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా మొగ్గు చూపుతుంటాయి. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పలు ప్రభుత్వ రంగ సేవలని ప్రైవేటు పరం చేసి చేతులు దులుపుకుంటోంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సూచనతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో పాత వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్.సి)ని ఇచ్చే బాధ్యతని ప్రైవేట్ సంస్థలకి అప్పజెప్పింది.***

వాడుకలో వున్న పాత వాహనాన్ని పరిశీలించి ఆ వాహనం తిరగడానికి అనుకూలంగా ఉందా లేదా అని ధృవీకరించి ఇచ్చే ఆమోద పత్రాన్ని ఎఫ్.సి(ఫిట్నెస్ సర్టిఫికెట్) అంటారు. వాస్తవంగా ఈ పని చేయాల్సింది రవాణా శాఖ. నెల్లూరుజిల్లాలో కూడా సదరు బాధ్యతని ప్రభుత్వం ప్రైవేటు పరం చేసి ఓ గుత్తేదారుడికి అప్పజెప్పింది. అయితే "కొండనాలుకకి మందేస్తే ఉన్న నాలుక ఊడింది" అన్న సామెతగా వాహనదారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం నుండి ప్రైవేటుకు అప్పజెప్పిన ఫిట్నెస్ ధృవీకరణ కార్యక్రమం వాహనదారుల పాలిట శాపమైంది. ఎఫ్.సి కోసం వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహన యజమానులు లబోదిబోమంటున్నారు.

**వివరాలలోకి వెళ్తే...**

ఆయన పేరు మహబూబ్ బాషా(పేరు మార్చాం). ఆయన ఓ ఆటోడ్రైవర్. బాషా స్వస్థలం ఉదయగిరి. గతంలో ఆయన తన ఆటో ఫిట్నెస్ ధృవీకరణ తీసుకోవాలంటే తనకి దగ్గరలోని కావలి లేదా ఆత్మకూరు రవాణా కార్యాలయానికి వెళ్ళేవాడు.

అలాగే జిల్లా సరిహద్దులో వున్న చిన్న పల్లెటూరు కదిరినాయుడుపల్లె. ఆ గ్రామంలో నివసించే రైతు రమణారెడ్డి (పేరు మార్చాం). ఆయనకి



ఓ ట్రాక్టర్ ఉంది. ఆ ట్రాక్టర్‌కి ఫిట్నెస్ సర్టిఫికెట్ (ఎఫ్.సి) కావాలంటే సమీపంలోని ఆత్మకూరు ఆర్.టి.ఓ కార్యాలయాన్ని ఆశ్రయించేవాడు.

కొత్తగా నెల్లూరుజిల్లాలో కలిసిన కందుకూరు వాస్తవ్యుడు హజరత్ నాయుడు (పేరు మార్చాం). ఆయన ఓ చిన్నసైజు కాంట్రాక్టర్. ఆయనకి నాలుగు టిప్పర్లు ఉన్నాయి. ఆర్.టీ.ఓ ఆఫీసు కందుకూరులోనే ఉండడంతో సుబ్బానాయుడు వాహనాలకు ఫిట్నెస్ అవసరమైనప్పుడు స్థానికంగానే తీసుకునేవాడు.

ఇవి ఒక్కొక్క ప్రాంతంలోని ఒక్కొక్కరి కథలు. ఇప్పుడు ఆ కథలన్నీ వ్యధలుగా మారాయి. ఇలా మహబూబ్ బాషా, రమణారెడ్డి, హజరత్ నాయుడు లాంటివాళ్ళు జిల్లా వ్యాప్తంగా వందలమంది ఉన్నారు. నెల్లూరునగర పరిసర ప్రాంతాలలో వున్న వారు తప్ప జిల్లా సరిహద్దులలో ఉన్నవారి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అందుకు కారణం జిల్లా మొత్తానికి ఒకే ఒక ప్రైవేట్ 'ఆటోమేటెడ్ టెస్టింగ్ కేంద్రం' ఉండడం. అదీ జిల్లాలో ఓ మూల ముత్తుకూరు మండలంలోని కప్పల దొరువు గ్రామం వద్దగల వల్లూరువారికండ్రిగలో కొలువై ఉండడం. పైన ఉదహరించిన ఉదయగిరి, కదిరినాయుడిపల్లి, ఆత్మకూరు, కందుకూరు వంటి ప్రాంతాల నుండి వాహనదారులు ఫిట్నెస్ ధృవీకరణ పత్రం పొందాలంటే కనీసం 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. పోనీలే అని వాళ్ళు 100కిలోమీటర్లు ప్రయాణం చేసి వాహనాలు తెచ్చినా.. అదేరోజు వాళ్ళకి ఎఫ్.సీ వస్తుందన్న గ్యారంటీ లేదు.

వాస్తవానికి ప్రభుత్వం తొలుత బి.ఎస్.ఆర్ అనే సంస్థకి ఈ కాంట్రాక్టు అప్పజెప్పింది. అయితే, ఆ సంస్థ సదరు కాంట్రాక్టుని 'ప్రణీత్ ఆథరైజ్డ్ టెస్టింగ్ సెంటర్'కి అమ్మేసుకుని వెళ్ళిపోయింది. ఇప్పుడు వాహనదారులంతా ప్రణీత్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

### ఛార్జీలలో వ్యత్యాసం.. సేవలలో ఆలస్యం!

వాస్తవానికి ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీలనే ఈ ప్రైవేట్ సంస్థలు వసూలు చేయాలి. అయితే, వాహన యజమానుల అవసరాన్ని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని వాహన యజమానులు వాపోతున్నారు. వాళ్ళు అడిగినంత ఇవ్వకపోతే "రేపో ఎల్లుండో రండి, ఇవ్వాళ ఖాళీ లేదు" అని చెప్పి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిన వాహనాలని వెనక్కి పంపే ప్రయత్నం చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సుదూర ప్రాంతం నుండి ప్రయాణం చేసి ప్రణీత్‌ని ఆశ్రయిస్తున్న ట్రాక్టర్, ఆటో వంటి చిన్న సైజు వాహనాల యజమానులు అక్కడి సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానానికి బలైపోతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రవాణాశాఖకి ఎలాంటి అధికారం, అజమాయిషీ లేకుండా ప్రభుత్వం ఆ శాఖ చేతులు కట్టేయడంతో రవాణాశాఖ పూర్తిగా డమ్మీగా మారిపోయింది. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు, అధికారులు ఈ సమస్యపై దృష్టిపెట్టి పరిష్కార మార్గం చూపించాలని వేలాది వాహనాల యజమానులు మొరపెట్టుకుంటున్నారు.




# ఆ ఇంట... అణువణువునా శోకం... అంతులేని దుఃఖం

## బస్సు ప్రమాద మృతుడు గోళ్ళ రమేష్ కుటుంబంలో ఆద్యంతం విషాదం!

అక్టోబర్ 24వ తేదీ శుక్రవారం తెల్లవారుఝూమున కర్నూలు వద్ద జరిగిన ఘోర రోడ్డుప్రమాదం నెల్లూరుజిల్లాకి పెను విషాదాన్ని మిగిల్చింది. వింజమూరు మండలం గోళ్ళవారిపల్లికి చెందిన ఒకే కుటుంబసభ్యులు గోళ్ళ రమేష్(31), ఆయన భార్య అనూష(27), వారి కుమారుడు శశాంక్ (07), కుమార్తె మన్విత(4) ఈ ప్రమాదంలో అగ్నికి ఆహుతై ప్రాణాలు విడవడం ఆ గ్రామాన్ని షాక్‌కి గురిచేసింది. నిరుపేదలైన తన తల్లితండ్రులకి, నిరాధారమైన తన అక్క (అత్త) కుటుంబానికి ఏకైక ఆధారమైన రమేష్ తమ కుటుంబంతో సహా అనంత లోకాలకి వెళ్లిపోవడం గోళ్ళ కుటుంబంలో అంతులేని విషాదాన్ని నింపింది. బ్రతుకుతెరువు కోసం స్వగ్రామాన్ని వదిలి బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు రమేష్. తన పెద్దక్క కూతురు అనూషని పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పండంటి బిడ్డలకి ఆ దంపతులు జన్మనిచ్చారు. దీపావళి సెలవుల సందర్భంగా బెంగళూరు నుండి హైదరాబాదుకి విహార యాత్రకి వెళ్ళారు.

తమ యాత్ర ముగించుకుని బెంగళూరుకి తిరుగు ప్రయాణంలో ఉండగా ఘోరం జరిగిపోయింది. వీ కావేరి స్లీపర్ బస్సులో నిద్రిస్తున్న ఆ నలుగురికి అదే చివరి రాత్రయ్యింది. దిక్కులు పిక్కటిల్లేలా హాహాకారాలు చేస్తూ మొత్తం 19 మంది కాలి బూడిద కాగా వారిలో రమేష్ కుటుంబం కూడా ఒకటి. ఈ సంఘటనతో గోళ్ళవారిపల్లి ఉలిక్కిపడింది. ఆ గ్రామ చుట్టుపక్కల పల్లెలన్నీ దిగ్భ్రాంతికి గురయ్యాయి. గోళ్ళ కుటుంబం తమ ఏకైన దిక్కుని కోల్పోయి దిక్కు లేని కుటుంబంగా మిగిలిపోయింది.

### ఓసారి గోళ్ళ కుటుంబ నేపథ్యాన్ని పరిశీలిస్తే...

గోళ్ళ మాలకొండయ్య – సుశీలమ్మ దంపతులు నిరుపేద రైతు కుటుంబానికి చెందినవాళ్ళు. తమకున్న ఒకటిన్నర ఎకరా పొలాన్ని ఓ వైపు సాగు చేసుకుంటూ మరోవైపు ఇతరుల పొలాలలో కూలి పనికి వెళ్తుంటారు. మాలకొండయ్యకి ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు. కాగా, రమేష్ ఆఖరి వాడు. తన పెద్ద కుమార్తెని తమ గ్రామంలోని వ్యక్తికే ఇచ్చి పెళ్ళి చేశాడు. అయితే, తన పెద్దల్లుడు ఆత్మహత్య చేసుకుని మరణించడంతో వారి కుమార్తె అనూషని తన కుమారుడు రమేష్‌కి ఇచ్చి పెళ్లిచేసి మనుమరాలినే కోడలిగా చేసుకున్నాడు మాలకొండయ్య. ఇదే తరుణంలో ఆయన పెద్ద కుమారుడు వెంకట్రావు కూడా కొద్దికాలం క్రితమే అనారోగ్యంతో కన్ను మూశాడు. ఇలా వరుస విషాదాలు మాలకొండయ్య కుటుంబాన్ని చుట్టుముడుతున్న క్రమంలో ఇప్పుడు తనకి అండగా ఉన్న కుమారుడు రమేష్ కుటుంబం మొత్తం అత్యంత దయనీయంగా బస్సు ప్రమాదానికి బలి కావడం విధి వైపరీత్యం. డి.ఎన్.ఏ పరీక్షలు నిర్వహించిన అనంతరం అక్టోబర్ 26వ తేదీ వారి నాలుగు పార్థివ దేహాలు గోళ్ళవారిపల్లెకి చేరుకున్నాయి. అనంతరం సోమవారం వారి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గోళ్ళవారిపల్లెతో పాటు పరిసర ప్రాంత ప్రజలు కూడా తరలివచ్చి రమేష్ కుటుంబానికి కడసారి కన్నీటి నివాళులు అర్పించారు.

### అత్యంత బాధాకరం - వెంకయ్యనాయుడు

అభం శుభం తెలియని పసివారితో సహా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అసువులు బాయడం అత్యంత బాధాకరం అని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మాలకొండయ్య కుటుంబంతో తనకి పరిచయం ఉందన్నారు. మాలకొండయ్యకి వెంకయ్య స్వయంగా ఫోన్‌చేసి పలకరించారు. జరిగిన ఘోరం తెలుసుకుని తన మనసు బరువెక్కిందని అన్నారు. అక్కడే వున్న ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌తో కూడా వెంకయ్య మాట్లాడారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా వుండాలని కోరారు. తనవంతు ఉడతాభక్తిగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని తన ప్రతినిధి ద్వారా ఆ కుటుంబానికి అందించారు.

### హృదయం ద్రవించిపోయింది - వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి స్వయంగా వెళ్లి రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. గుండెలవిసేలా రోదిస్తున్న ఆ కుటుంబ పెద్దని చూసి హృదయం ద్రవించిపోయిందన్నారు. తనవంతు సహాయంగా 5లక్షల రూపాయల విరాళాన్ని ఆ కుటుంబానికి అందివ్వనున్నట్లు ప్రకటించారు.

### అన్ని విధాలా ఆదుకుంటాం - కాకర్ల సురేష్

ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ కూడా 3లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందివ్వనున్నట్లు ప్రకటించారు. అదే విధంగా ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు.

### పలువురు జిల్లా నేతల సంతాపం

దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు జరిగిన పెను విషాదం పట్ల తమ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. రమేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## క్రికెట్‌లో సత్తాచాటిన.. 'నారాయణ' విద్యార్థులు



జాతీయస్థాయి క్రికెట్‌లో నెల్లూరులోని నారాయణ విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. యూత్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన పోటీల్లో వారు విజేతలుగా నిలిచారు. దీంతో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వి.విజయభాస్కర్‌రెడ్డి వారిని సన్మానించారు. క్రికెట్‌లో ఉత్తమ ఆటతీరును ప్రదర్శించిన కుశ్వంత్, మన్సూర్, మనోజ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మధుసూదన్‌రెడ్డి, కోర్ డీన్ శ్రీనివాసులు, డీన్ వర్ధనతి, ప్రిన్సిపాల్స్ నాగార్జున, లక్ష్మయ్య, కామాక్షి, కోచ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## 'ప్రవాసాంధ్ర భరోసా బీమా'ని సద్వినియోగం చేసుకోండి

ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభివృద్ధి, భద్రతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎన్ఆర్టి సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని అందిస్తోందని సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ఇటీవల దుబాయ్‌లో ప్రారంభించారని, దీని ద్వారా విదేశాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కి చెందిన ఉద్యోగులు, విద్యార్థులు లబ్ధి పొందవచ్చునని పేర్కొన్నారు. ఉద్యోగులు, వలస కార్మికులు, విద్యార్థుల కోసం ఈ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారని వివరించారు.



## శివతత్వాన్ని వివరించిన... 'కార్తీక' ప్రవచనాలు

నెల్లూరులోని పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక రేబాలవారి వీధిలో ఉన్న రాజ్‌టవర్స్‌లో ఈనెల 23 నుంచి కార్తీక మాస ఆధ్యాతిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 29వ తేదీ వరకు జరిగిన ఈ ప్రవచనాల్లో కార్తీక మాసం విశిష్టత గురించి స్థానిక సాహితీవేత్త డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు వివరించారు. సారస్వతవేత్తలు సూరం చంద్రశేఖరం, పోలవరపు లక్ష్మీనరసింహారావు, కొండేపి మురళీకృష్ణ, కోట శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డా. చీమకుర్తిని ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు ఘనంగా సన్మానించారు. రెండవరోజు ఈనెల 24న జరిగిన ప్రవచనాల్లో ఉపాధ్యాయిని సూరం అరుణ పాల్గొని శివతత్వంపై ఉపన్యసించారు. శివతత్వం అనంతమైనది.. మహోన్నతమైనదని ఆమె వివరించారు. బెజ్జమహాదేవి పూసలుడు, గోడగూచి కథల ద్వారా శివతత్వాన్ని ఆమె విశదీకరించారు. అవధాని కోట రాజశేఖర్, సభా పోషకులు పాముల మల్లికార్జునరావు తదితరులు పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు.

## టూకీగా...

### తిక్కవరప్పాడులో పెరటితోటల పెంపకంపై శిక్షణ

వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడులో నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త శైలజ ఆధ్వర్యంలో ఇటీవల పెరటితోటల పెంపకంపై రైతులకు, మహిళలకు శిక్షణ ఇచ్చారు. కూరగాయలను సేంద్రియ పద్ధతుల్లో ఎలా పండించుకోవచ్చో వివరించారు. అనంతరం, లబ్దిదారులకు కూరగాయల విత్తన ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు.

### మర్రిపల్లిలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

పొదలకూరు మండలం మర్రిపల్లి గ్రామం వద్ద పొలాల్లో ఉన్న ఓ గదిలో పేకాటాడుతున్న 8 మంది పేకాటరాయుళ్ళను ఇటీవల పోలీసులు అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.45,556, మోటార్‌బైక్, కారు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హనీఫ్ ఆధ్వర్యంలో వారిపై కేసు నమోదు చేశారు.

### పిల్లాపేరు వాగువద్ద జాగ్రత్త!

వరికుంటపాడు మండలం రామదేవులపాడు సమీపంలోని పిల్లాపేరు వాగు భారీవర్షాల ధాటికి పొంగి ప్రవహిస్తోందని, వాగువద్ద ఉన్న వంతెనపై నీటి ప్రవాహం పొంగుతోంది కనుక ప్రజలు, వాహనదారులు ఆ దారిన వెళ్ళవద్దని తహశీల్దార్ పసుపులేటి హేమంత్‌కుమార్, ఎస్ఐ రఘునాథ తెలిపారు. వంతెనపై నీరు తగ్గేదాకా అటువైపు ప్రయాణించవద్దన్నారు.

### రామానాయుడుపల్లిలో ఈతకు వెళ్ళి బాలుని మృతి

సీతారామపురం మండలం రామానాయుడుపల్లికి చెందిన కోనంకి రామ్‌చరణ్ అనే బాలుడు గ్రామ సమీపంలోని బొగ్గేరు వాగులో ఈతకు వెళ్ళి ప్రమాదవశాత్తూ మరణించాడు. ఈనెల 27న ఈ దుర్ఘటన జరిగింది. సమాచారం తెలిసిన వెంటనే ఆత్మకూరు సీఐ గంగాధర్‌రావు, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనాస్థలానికి వెళ్ళి పరిశీలించారు.

### పాటూరు సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

అకాలవర్షాలు, తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ఈనెల 27న కోవూరు మండలం పాటూరులోని సచివాలయాన్ని తహశీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలన్నారు. వర్షాలు, తుఫాన్‌ల సమయాల్లో మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

### గంగపట్నంలో తుఫాన్ బాధితులకు సాయం

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలోని గిరిజనకాలనీలో ఉన్న తుఫాన్ బాధితులకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సూచనలతో ఈనెల 27న మంచినీరు, ఆహారం అందించారు. పంచాయతి కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఆలయ ఛైర్మెన్ కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

### సంగంలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

మండల కేంద్రమైన సంగంలోని గిరిజనకాలనీలో ఉన్న గిరిజనులకు తన తండ్రి తోట చిన్న పెంచలయ్య వర్ధంతి సందర్భంగా ఉదయగిరి ఎంఇఓ తోట శ్రీనివాసులు ఇటీవల దుప్పట్లు పంచిపెట్టారు. సుమారు వందమందికి దుప్పట్లు అందజేశారు. సంగం తన స్వస్థలం కావడంతో త్వరలోనే ఈ ప్రాంతం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు.

### కలువాయిలో నీటిపథకాల పరిశీలన

భారీవర్షాల నేపథ్యంలో ఈనెల 27న కలువాయి మండలంలో ఉన్న గ్రామీణ నీటి సరఫరా పథకాలను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ ఆర్‌ఓ ప్లాంట్ వద్ద తనిఖీలు చేసి, నీటి నాణ్యత గురించి సిబ్బందికి వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఇ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశీలనల్లో ఎండిఓ శైలజ, ఏఇ ఆంజనేయులు, పంచాయతి కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

### పురిణి తుఫాన్ సెంటర్‌ని పరిశీలించిన డీటీ

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఈనెల 27న అల్లూరు మండలం, పురిణి గ్రామంలో ఉన్న తుఫాన్ షెల్టర్ పరిస్థితిని డిప్యూటి తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆ తర్వాత కొత్తపాళెం తుఫాన్ నగర్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను కూడా పరిశీలించి, సిబ్బందికి జాగ్రత్తలు చెప్పారు. భారీ వానలు కురుస్తున్నాయి కనుక అప్రమత్తంగా ఉండాలన్నారు.

# శ్రద్ధాంజలి



జననం: 18.01.1946 నిర్యాణం: 05.11.2017

స్నేహశీలి, మృదుస్వభావి,
మంచి మనసున్న మహామనీషి, మానవతావాది

**కీ॥శే॥ ఆదాల రాఘవరెడ్డి గారు**

పరమపదించి తేది. 05.11.2025 నాటికి
ఎనిమిదేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
**ఆదాల అరుణ**
కుమార్తె
**ఆదాల సాయి అపర్ణ**

కుమారుడు - కోడలు
**ఆదాల వంశీకృష్ణ - రచన**
మనుమరాళ్ళు
**సాయి అనిక, సాయి అవని**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com